నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ప్రకాశం | బాపట్ల
శనివారం 28 డిసెంబరు 2024 పేజీలు 8

# సౌర విద్యుత్ వినియోగం పెంచేలా చూడాలి

## జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: సౌర విద్యుత్ వినియోగం పెంచేలా సంబంధిత శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలో పీ.ఎం. సూర్య ఘర్ పథకం అమలుపై శుక్రవారం సంబంధిత అధికారులతో ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో 5 వేలకు పైగా జనాభా ఉండి ఎక్కువగా స్థాయిలో సౌర విద్యుత్తును వినియోగించే ఒక గ్రామంలో మరింతగా సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కోటి రూపాయలను ఇవ్వనున్నది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంపిక చేసిన ఐదు ప్రత్యేక గ్రామాలలో ఈ దిశగా సాధించిన పురోగతిపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లాలో తూర్పు నాయుడుపాలెం, శంఖవరం, నాగంబొట్లపాలెం, సింగరాయకొండ, బేస్తవారిపేట గ్రామాలను ప్రత్యేక గ్రామాలుగా ఎంపిక చేసి ఆయా గ్రామాలలో సౌర విద్యుత్

మిగతా 3లో

# జగన్ పాపం వల్లే విద్యుత్తు భారం

## చార్జీలు పెంచినందుకే జగన్ పవర్ పీకేసిన ప్రజలు
## ఇప్పటికైనా జగన్‌రెడ్డి మోసాలు మానుకోవాలని హితవు
## మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



టంగుటూరు, మేజర్‌న్యూస్: నాడు ముఖ్యమంత్రిగా జగన్ చేసిన పాపాలు నేటికీ రాష్ట్ర ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం ఆయన తూర్పునాయుడుపాలెంలో తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలపై నాడు విద్యుత్ భారాలు మోపి నేడు ఏమీ ఎరుగునట్టు ధర్నాలకు పిలుపు నివ్వడం సిగ్గుచేటన్నారు. తాను పెంచిన చార్జీలపై తన పార్టీ శ్రేణులతోనే ధర్నాలు చేయించడం సైకో చర్య అని దుయ్యబట్టారు. ఏపిఈఆర్‌సి అనుమతించిన దాని కన్నా రూ. 19 వేల కోట్లు అదనంగా విద్యుత్ కొనుగోళ్లకు ఖర్చు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. యూనిట్ రూ.5 లకే వచ్చే విద్యుత్‌ని కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్‌లో రూ.8 నుంచి రూ.14కి కొనుగోలు చేసింది జగన్ కాదా అని ఎద్దేవా చేశారు. జగన్ తన అవినీతిని ప్రజలపై సర్దుబాటు ఛార్జీల రూపంలో భారం మోపేందుకు నాడే ఏపిఈఆర్‌సి అనుమతి కోరింది వాస్తవం కాదా అని నిలదీశారు. జగన్ అవినీతి, ధన దాహం వల్లే ప్రజలపై నేడు విద్యుత్ భారం. ఇవ్వన్నీ తెలిసి కూడా దొంగే దొంగ అన్నట్టు జగన్ వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పవర్ చార్జీలు పెంచినందుకే జగన్‌కి ప్రజలు పవర్ పీకేశారన్న విషయం జగన్ తెలుసుకోవాలని గుర్తుచేశారు. జగన్ ఇకనైనా ప్రజలను మోసం చేయడం మానుకొని వాస్తవాలు గ్రహించాలని హితవు పలికారు.

# ఉనికి కోసమే జగన్‌రెడ్డి డ్రామా

## విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదు
## ఆ పాపం జగన్‌దేనని పిల్లాడ్ని అడిగినా చెప్తారు
## విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్

సూర్యప్రతినిధి, ఒంగోలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంత వరకూ విద్యుత్ చార్జీలను పెంచనేలేదని, జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చేసిన చేసిన పాపాల కారణంగా విద్యుత్ చార్జీలు పెరిగాయని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. 22.5 మిలియన్ యూనిట్ల కొరత ఉన్న రాష్ట్రాన్ని 2019 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్ది వైసీపీ ప్రభుత్వానికి నాటి టీడీపీ ప్రభుత్వం అప్పగించిందని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు కూడా తెలుగుదేశం ప్రభుత్వం ఒక్క రూపాయి కరెంట్ చార్జీలు పెంచలేదని గుర్తు చేశారు. కానీ 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న ప్రజలపై రూ.35 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపడమే కాకుండా రూ.1.20 లక్షల కోట్ల నష్టాన్ని విద్యుత్ శాఖలో తెచ్చిపెట్టారన్నారు. గుట్టుచప్పుడు కాకుండా డిస్కంల ద్వారా ప్రజలపై భారం వేయండని ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపారన్నారు. సాధారణంగా ఈఆర్సీకి పంపిన 90 రోజుల్లోపు ట్రూ అప్ చార్జీలు ఆమోదం పొందాలని కానీ 2024 మే వరకు కూడా ట్రూ అప్ చార్జీలను వాయిదా వేస్తూ వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈఆర్సీ నుంచి ఆమోదం పొందిన ట్రూప్ అప్ చార్జీలు నేడు ప్రజలపై భారంగా పడుతున్నాయని వివరించారు. ప్రతీ ఏటా విద్యుత్ వినియోగం సగటున 6 శాతం పెరుగుతుందని, పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్లు ఉత్పత్తిని కూడా పెంచాల్సి ఉంటుందని వివరించారు.

# రెవెన్యూ సదస్సు నుంచి వెనుదిరిగిన తహసీల్దార్

## దిద్దులకు గురయిన రికార్డులతో సమస్యలు
## పరిష్కారం నావల్ల కాదంటూ వెళ్లిన వైనం
## కలెక్టర్ స్పందించాలని వేడుకుంటున్న గ్రామస్తులు



తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండలంలో భూకబ్జాదారులు రోజురోజుకు అధికమవుతున్నారు. ఆక్రమణదారుల నుంచి భూ యజమానులకు న్యాయం చేయాల్సిన అధికారులు పరిష్కరించలేమంటూ సమావేశాల నుంచి వెనుదిరిగిపోయే పరిస్థితి తర్లుపాడు మండలంలో చోటుచేసుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రాష్ట్ర ప్రజల కోసం భూసమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారు. తర్లుపాడు మండలంలోని కారుమానుపల్లిలో మండల తహసీల్దార్ యు.విజయభాస్కర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులను అడ్డం పెట్టుకొని భూ కబ్జాదారులు వారి ఇష్టం వచ్చినట్లుగా కబ్జా చేస్తున్నారని, కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండలతో రెవెన్యూ రికార్డుల్లో పేర్లను తారుమారు చేస్తూ అడ్డగోలుగా కబ్జాదారుల పేర్లు, వారి బంధువుల పేర్లు రాసుకొని ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించారు. ఇందుకు సంబంధించిన రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో మాకు తెలియాలంటూ రెవెన్యూ సదస్సులో నిరసన వ్యక్తం చేశారు. కారుమానుపల్లి సర్వే నంబర్ 77/9 రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీలో షేక్. పూల మహబూబీకి మంజూరు చేసింది. ఈ భూమిని నాలుగేళ్ల క్రితం వైసీపీ నాయకుడు

మిగతా 3లో



## దళారుల మాటలు నమ్మొద్దు
# ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు
## పోలీసు కానిస్టేబుల్ ఈవెంట్స్ పకడ్బందీగా నిర్వహిస్తాం
## జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ వెల్లడి




# పది, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

## సంక్షేమ హాస్టళ్లల్లో విద్యార్థులకు మెరుగైన భోదనతో పాటు ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



ఒంగోలు, మేజర్‌న్యూస్ : సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు మెరుగైన భోదన అందించడంతో పాటు వారి ఆరోగ్య సంరక్షణకు కూడా సమప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. జిల్లాలోని సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, సహాయ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఇతర సిబ్బందితో శుక్రవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్ , ఇంటర్మీడియట్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని పునరుద్ఘాటించారు. ఈ దిశగా ఇప్పటికే రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక, ప్రత్యేక శిక్షణా తరగతుల నిర్వహణపై ఆమె ఆరాతీశారు. విద్య, ఆరోగ్య, భద్రతకు సంబంధించి విద్యార్థుల నుంచి ఒక్క ఫిర్యాదు వచ్చినా బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. హాస్టళ్లలో ఉంటున్న

మిగతా 3లో

## కృషిబాబు అకాల మరణం టీడీపికి తీరనిలోటు: ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామ టీడిపి సీనియర్ నాయకులు ప్రముఖ న్యాయవాది కామేపల్లి కృషి బాబు మరణం తెలుగుదేశం పార్టీ కి వ్యక్తిగతంగా తనకి తీరని లోటు అని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలియచేశారు. తెలుగుదేశం పార్టీ ఎ కార్యక్రమం నకు పిలుపునిచ్చిన బాధ్యత గా తీసుకుని విజయవంతం చేయడం లో ముఖ్య పాత్ర పోషించే వారన్నారు. నరసాయపాలెం గ్రామ అభివృద్ధి కి ఎంతో పాటు పడిన కృషి బాబు ఈ రోజు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం అని అన్నారు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## పేదలకు ఆర్థిక సాయం



రేపల్లే, మేజర్‌న్యూస్: చిన్న వయసు నుంచే పేదలకు సాయం చేయడంలో ముందుండేవారమని మాజీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మాజీ కౌన్సిలర్ చెన్ను లక్ష్మణరావు (ఎల్.జి) అన్నారు. శుక్రవారం క్రిస్టమస్ నూతన సంవత్సరం పురస్కరించుకొని పట్టణం లో గల అనాధాశ్రమంలో పిల్లలకు వృద్ధులకు వితంతులకు నూతన వస్త్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఎల్ జి మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి క్రిస్టమస్ నూతన సంవత్సరం పురస్కరించుకొని నూతన వస్త్రాలను అందిస్తున్నామని అదేవిధంగా నిత్యం వారికి అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖల్లో పాలపంచుకుంటున్నామని తెలిపారు. రానున్న కాలంలో కూడా నిత్యం సేవ చేయడానికి తమ కుటుంబం ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు బాబురావు తదితరులు పాల్గొన్నారు

## పాండురంగస్వామి గుడిలో ధనుర్మాస ఉత్సవాలు



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం చీలు రోడ్డులో వేంచేసి ఉన్న రుక్మిణీయ సమేత పాండురంగ స్వామి వారి దేవాలయ ప్రాంగణము నందు ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం 12వ రోజు అమ్మవారి 12 వ పాశురం, విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామం, హనుమాన్ చాలీసా, కృష్ణాష్టకం, గోవింద నామాలు పట్టించడం జరిగింది. అనంతరం శుక్రవారాన్ని పురస్కరించుకొని భక్తులు అమ్మవారికి దీపాలు వెలిగించి హారతి ఇవ్వటం జరిగింది దీపాలంకరణ సేవా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నీరాజనం మంత్ర పుష్పాలు తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించామని ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు తెలియజేశారు.

## రహదారి పనులు పరిశీలించిన కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్: ఎన్ హెచ్ ఏ 167 ఏ ఓడరేవు-పిడుగురాళ్ల రాష్ట్ర రహదారి పనులను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి పరిశీలించారు. శుక్రవారం పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామం వద్ద రహదారి నిర్మాణం కోసం చేపట్టిన భూములను పరిశీలించారు.అనంతరం రహదారి నిర్మాణం కోసం చేపట్టిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, పర్చూరు తహసీల్దార్ బ్రహమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# ఢంకా మోగించి చెప్పండి ఒక్కరోజు ముందే పెన్షన్: కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్: జనవరి మాసపు పింఛన్లను ఈనెల 31 వ తారీఖున పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. మండల స్థాయి అధికారులు మరియు మున్సిపల్ కమిషనర్లు 30వ తారీఖునే నగదును అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పింఛన్ పంపిణీ దారులు ఈరోజు నుండి వారి గ్రామాలలో ఇంటింటికి వెళ్ళి పింఛన్ 31 వ తారీఖున పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పాలన్నారు. గ్రామాల్లో టామ్ టామ్ ల ద్వారా ప్రచారం చేయాలన్నారు. ప్రచారం వల్ల అందరూ అందుబాటులో ఉండే అవకాశం ఉందన్నారు. అదే రోజు 100% పంపిణీ జరిగేలా చూడాలన్నారు. బయోమెట్రిక్ పరికరములను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు ఇద్దరూ కూడా ఉదయం 5.30 నిమిషాలకు పింఛన్ పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారుల లాగిన్ లో ప్రతి అర్ధగంటకు ఒకసారి పింఛన్ పంపిణీకి సంబంధించి పర్యవేక్షించాలన్నారు. సంబంధిత సిబ్బందితో మాట్లాడాలని అన్నారు. పంపిణీ కానీ పింఛన్ ను ఆరోజు సాయంత్రం సెర్ప్ అకౌంట్లో ఉంచాలన్నారు. రిమార్కులు కూడా నమోదు చేయాలని ఆయన తెలిపారు.

# ప్రజలను మోసం చేస్తున్న కూటమి నాయకులు




రేపల్లే, మేజర్‌న్యూస్: తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి హామీని తుంగలో తొక్కారని వైయస్సార్ పార్టీ రేపల్లె నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ ఆరోపించారు.శుక్రవారం వైయస్సార్ పార్టీ తరపున విద్యుత్ చార్జీలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా రేపల్లె విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పరిపాలన సాగుతుందని సూపర్ సిక్స్ పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం మరోసారి మోసం చేసిందన్నారు. ఇంతవరకు ఒక్క పథకం కూడా అమలుపరచలేని అసమర్థత ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని సంచలన ఆరోపణ చేశారు. ఇలాంటి ప్రభుత్వానికి రానున్న కాలంలో ప్రజలే గట్టి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె మండల జిల్లా పరిషత్ సభ్యులు బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ప్రభు కిరణ్, రాష్ట్ర మాజీ హ్యాండీక్రాఫ్ట్ డైరెక్టర్ చిత్రాల ఒబేద్, మాజీ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిమాటా బాలాజీ, మాజీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ అబ్దుల్ ఖుద్దుస్, వైయస్సార్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టెం శ్రీనివాసరావు, మండల పరిషత్ సభ్యులు మేడికొండ అనిల్, పట్టణ యువజన విభాగం అధ్యక్షులు ఆలా రాజ్ పాల్, కరేటి శేషగిరి, నాగలక్ష్మి, పిచ్చయ్య బాబు, కాటూరి శివ, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వంగవీటి రాధాకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి: వేల్పూరి



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: గత మే నెలలో జరిగిన 2024 సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన,బిజెపి కూటమి రాష్ట్రంలో 164 స్థానాల్లో విజయం సాధించటానికి ఎన్నికల ప్రచారము లో కీలకపాత్ర పోషించిన వంగవీటి మోహన్ రంగా తనయుడు, యువతకు ఆశాజ్యోతి గా పేరుగాంచిన వంగవీటి రాధాకృష్ణ కు మంత్రి పదవి ఇవ్వాలని కాపు ఉద్యమ నేత వేల్పూరి శ్రీనివాసరావు సిఎం చంద్ర బాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,ప్రధాని నరేంద్ర మోడీ కి వ్రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. శుక్రవారం భట్టిప్రోలులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1988 లో కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు గా ఉన్న వంగవీటి మోహన్ రంగా దళితులు,బడుగు బలహీన వర్గాల ఇళ్ళ పట్టాలు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రంగాను రాజకీయ శక్తులు హత్య చేసిన కారణంగా,రాష్ట్రంలో అధికారంలో కి కాంగ్రెసు పార్టీ వచ్చినా రంగా సతీమణి రత్న కుమారి,రంగా సోదరుడు శోభానా చలపతిరావు, రాజశేఖరరెడ్డి హయాంలో విజయవాడ శాసనసభ్యుడు గా ఉన్న రంగా తనయుడు రాధాకృష్ణ కు మంత్రి పదవి ఇవ్వకుండా కాంగ్రెసు పార్టీ మోసం చేసిందని శ్రీనివాసరావు విమర్శించారు .

# పేద విద్యార్థులు చదువులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: విద్యార్థుల భవిష్యత్తుకు దాతల సహకారభావంతో ముందుకురావడం అభినందనీయమని ఎంఈఓ 2 గుడిపూడి శేషుగోపాలం అన్నారు. నిజాంపట్నం గ్రామానికి చెందిన దాత కీదారి హనుమంతురావు సహకారంతో నిజాంపట్నం పంచాయతలో ఉన్న పది ప్రాథమికపాఠశాలల్లో చదువుతున్న ఒకటి రెండు తరగతుల విద్యార్థిని విద్యార్థులకు 100 మందికి పలకలు శుక్రవారం నిజాంపట్నం శివపురం పాఠశాలలో ఎంఈఓ 1 చేతుల మీదగా ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి దాతల స్ఫూర్తితో విద్యను అభ్యసించి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బాజీ బీ, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ కన్వీనర్ చందా నరసింహారావు, మండల అధ్యక్షుడు ఎం. తులసీ దాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. సుబ్బారావు, టి. శివరా మకృష్ణ, బి. ప్రసాద్ పాల్గొని దాత హనుమంతురావును అభినందించారు.

# విశ్వవిఖ్యాత ఉర్దూ కవి గాలిబ్ 227వ జయంతి సభ



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: ఉర్దూ సాహిత్యాన్ని విశ్వవ్యాప్తంగా ప్రజ్వలింప చేసిన కవులలో గాలిబ్ ప్రముఖులని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ కొనియాడారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో జరిగిన గాలిబ్ 227 వ జయంతి సభకు రావూరి నరసింహ వర్మ అధ్యక్షత వహించారు. గాలిబ్ రచించిన "దీవానా ఏ గాలిబ్ "అనే గ్రంథాన్ని దాశరథి గాలిబ్ గీతాలు పేరుతో తెలుగులో అనువదించి ప్రముఖ నటులు అక్కినేని నాగేశ్వరరావు కి అంకితం ఇచ్చారన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ హిందీ పండితులు అబ్దుల్ ఖాదర్ జీలాని మాట్లాడుతూ గాలిబ్ చివరి మొగలు చక్రవర్తి అయిన బాహదూర్ షా జఫర్ ఆస్థాన కవిగా ఉండే వారని అన్నారు.వారు ఉర్దూ, పార్సీ భాషలలో కూడా రచనలు చేశారన్నారు. వారి గజళ్ళతో పాటు వారి లేఖలు కూడా ఉర్దూ సాహిత్యంలో గొప్ప రచనలుగా పరిగణింపబడుతున్నాయని తెలిపారు. ఈ సభలో మర్రి మాల్యాద్రి రావు, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డు పల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు గాలిబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

## మావిళ్ళ కొండలును పరామర్శించిన కోన



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: బాపట్ల మండలం అడవి పంచాయతీ రామాపురం వైఎస్ఆర్సిపి నాయకుడు మావిళ్ళ కొండలు తండ్రి మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి కొండలను పరామర్శించారు బాపట్ల మాజీ శాసనసభ్యులు కోన రఘుపతి. వారితో పాటుగా బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, గోసాల కోదండ, సింగోతి పాల చంద్ర రావు, కొండయ్య, గోవిందు, అమ్మోరియ, జీవ, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ పరిశీలించిన కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్: త్రై మాసిక తనిఖీల్లో భాగంగా ఈ వి ఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి. శుక్రవారం బాపట్ల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్ గోడౌన్ ను అంతర్గత తనిఖీ లో భాగంగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి గ్లోరియా, తహసీల్దార్ సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు అన్నవరం ఏకాంబర్ రావు, మహమ్మద్ గౌస్ బాషా, కె.వి. రామకృష్ణ, సి. హెచ్ గంగయ్య, డి.రవి, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ శత జయంతి ఉత్సవాలు



రేపల్లే, మేజర్‌న్యూస్: దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని వీరోచిత పోరాటాలను నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రేపల్లె సిపిఐ కార్యాలయం వద్ద సిపిఐ శాఖ కార్యదర్శి చొక్కాకుల శివశంకర్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్ లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన పార్టీ సిపిఐ యేనన్నారు. దేశవ్యాప్తంగా కష్టజీవులు, శ్రామికుల పక్షాన పోరాడిందన్నారు. లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేసిన ఘనత సిపిఐకే దక్కిందని నాగాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టు ముక్కల బాలాజీ, ఎఐటియుసి నాయకులు ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ : బిఆర్ గౌస్

### – ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు



ఒంగోలు, మేజర్‌న్యూస్ : భారత ఆర్థిక వ్యవస్థను కొత్త పుంతలు తొక్కించి, భారత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసినటువంటి మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త బిఆర్ గౌస్ అన్నారు. మాజీ ప్రధానమంత్రి, కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత అయినటువంటి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆకస్మిక మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త బిఆర్ గౌస్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ ఈ దేశానికి రెండు సార్లు ప్రధానమంత్రిగానే గాక ఆర్బీఐ గవర్నర్గా, ప్రణాళికా సంఘం ఉపాధ్య క్షుడిగా, కేంద్ర ఆర్థిక మంత్రిగా భారతదేశం ఆర్థికంగా నిలదుక్కోవటంలో, ప్రపంచంలోమూడవ ఆర్థిక శక్తిగా ఎదగడంలో మన్మోహన్ సింగ్ పాత్ర మరచిపోలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్య నిర్వహణ అధ్యక్షులు వద్దండి మల్లికార్జున రావు, లీగల్ సెల్ జిల్లా చైర్మన్ సుదర్శన్ రవి, డిసిసి ఉపాధ్యక్షులు షేక్ రసూల్, ఒంగోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలకలపూడి బుజ్జి, యువజన కాంగ్రెస్ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు రాయపాటి గిడియన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఇమామ్, దండుప్రోలు ప్రసాద్ పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు

### కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: భారతీయ ఆర్థిక చాణిక్యుడు, నిబద్ధత కలిగిన నేత మాజీ ప్రధాని స్వర్గీయ మన్మోహన్‌సింగ్ మృతి పట్ల ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం తీవ్ర దిగ్భ్రాంతి ఒక ప్రకటనలో వ్యక్తం చేశారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి భారత దేశానికి తీరని లోటు అని వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని ఆయన ఆత్మ శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నామని శ్రీపతి ప్రకాశం తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో కొండేపి కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ శ్రీపతి సతీష్ నియోజకవర్గ నాయకులు తెలియజేశారు.

## సచివాలయాలలోఎస్సీ కులాల జాబితాను సరిచూసుకోండి : సుజన్ మాదిగ



ఒంగోలు, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసే కార్యక్రమంలో భాగంగా, గ్రామ సచివాలయాలలో వీఆర్వోల వద్ద ఎస్సీ కులాల జాబితాను అందించారని, ఆ కులాల జాబితాలో మీ కులం పేరు తప్పుగా పడితే తక్షణమే సరిచేసుకోవాలని, రాష్ట్ర మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ తెలియజేశారు. శుక్రవారం ఒంగోలులోని ఎమ్.ఎస్.పి.ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు గత నెల ఆగస్టు ఒకటవ తేదీన ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాలకు, స్వయం ప్రతిపత్తిగా చేసుకోవచ్చని దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం, ఏడుగురు జడ్జిలతో కూడిన తీర్పు వెలువడడంతో, ఆ తీర్పుని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కమిషన్ వేయడం జరిగిందన్నారు. కులం పేరు తప్పుగా నమోదైతే స్థానిక వీఆర్వోకి అబ్జెక్షన్ తెలిపి, మీ కులాన్ని సరిచేసుకొనవచ్చన్నారు. ఈ ప్రక్రియఈ నెల 30వ తేది వరకూ కొనసాగుతుందనీ.మాదిగలు గమనించవలసినది ఏంటంటే, ఇది మన జాతి భవిష్యత్తుకి సంబంధించిన విషయం, ఎవరు అశ్రద్ధ చేయకుండా తక్షణమే గ్రామ సచివాలయాలకు తరలివెళ్ళాలని, ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమం పోరాట సమితి నాయకులు గద్దె త్యాగరాజు, కొలకలూరి బాలాజీ రావు, గద్దల విల్సన్, కోలకలూరు విజయ్, బండారు సురేష్, ఏసోబు కత్తి పవన్ రాజేష్ అనుక్,తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సు నుంచి వెనుదిరిగిన తహసీల్దార్

**మొదటి పేజీ తరువాయి** పోలేబోయిన వెంకటేశ్వర్లు తన భార్య అయిన పోలేబోయిన రవణమ్మ పేరుమీద మా పేరును తీసివేసి ఆన్‌లైన్ లో అక్రమంగా ఎక్కించుకున్నారని సమస్యను పరిష్కారం చూపాలని షేక్. పూల మహబూబీ తన కుటుంబ సభ్యులతో అర్జీ ఇచ్చి పరిష్కరించాలంటూ అధికారుల ముందు భోరున విలపించింది. ఇలాంటి సమస్యలను పరిష్కారం చూపలేనని తర్లుపాడు మండల తహసీల్దార్ యు.విజయ భాస్కర్ మండలం మొత్తం ఇలాంటి సమస్యలే వస్తున్నాయని సదస్సు నుంచి అర్ధంతరంగా కారు ఎక్కి వెళ్లిపోయారు. మిగిలిన రెవెన్యూ అధికారులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో అయోమయంగా సభలో ఉండిపోయారు. పోలేబోయిన వెంకటేశ్వర్లు అనే వైసిపీ నాయకుడు చెన్నారెడ్డి పల్లి గ్రామ ఇలాకాలో సర్వే నంబర్ 150/2, 156/2, 170/1, 186, 69/2 చెన్నారెడ్డిపల్లి గ్రామ ఇలాకాలో ఆఖరికి పశువుల మేత బీడు, ఏడబ్ల్యూఎస్ ల్యాండ్‌ని కూడా వదలలేదనే విమర్శలున్నాయి. సర్వే నంబర్ 282/1లో 2ఎకరాలు 156/1 లో పశువుల బీడు 24 ఎకరాలు భూమిని కూడా వదలలేదు. అంతేకాకుండా కారుమానుపల్లి ఇలాకాలో మూర్తయ్య అనే నిరుపేద వ్యక్తిని కూడా వదలలేదు, మండలంలోని మంగళకుంట, తుమ్మలచెరువు గ్రామాలలో తన కుటుంబ సభ్యుల పేర్లతో భూములు ఉన్నాయి. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి స్పెషల్ కమిటీ వేసి సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

## పది, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



**మొదటి పేజీ తరువాయి** పిల్లలను తమ స్వంత బిడ్డలుగా భావించి వారి విద్య, ఆరోగ్య, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, బి.సి. సంక్షేమ అధికారి అంజల, మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, దివ్యాం గుల సంక్షేమ సహాయ సంచాలకులు అర్చన, డి.ఎం. హెచ్.ఓ. వెంకటే శ్వర్లు, డి.సి. హెచ్.ఎస్. సూరిబాబు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డి.పి.ఓ. వెంకట్ నాయుడు, ఏ.పి. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ జయ, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### జనవరి నెలాఖరుకు పూర్తి కావాలి

సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతు పనులను జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ మరమ్మతు పనులపై నిర్మాణ ఇంజినీరింగ్ శాఖలతో శుక్రవారం కలెక్టరేట్లో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇతర ఇంజినీరింగ్ విభాగాలకు శాఖాపరమైన పనులు ఉన్నందున సమగ్ర శిక్ష అభియాన్‌క్కు కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలలోని హాస్టళ్లను, ఏ.పి.ఈ.డబ్ల్యు.ఐ.డి.సి.కి మిగతా నియోజకవర్గాలలోని హాస్టళ్లను కలెక్టర్ కేటాయించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, ఏ.పి ఈ.డబ్ల్యు.ఐ.డి.సి ఈ.ఈ భాస్కరబాబు, సమగ్ర శిక్షా అభియాన్ ఈ.ఈ ఎం.మన్నయ్య, ఆర్.బి. ఎస్.ఈ దేవానందం, పంచాయతీరాజ్, ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## సౌర విద్యుత్ వినియోగం పెంచేలా చూడాలి

**మొదటి పేజీ తరువాయి** వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టిన చర్యలు, సాధించిన పురోగతిపై ఈ సందర్భంగా కలెక్టర్ ఆరా తీశారు. వీటితో పాటు అన్ని గ్రామాల్లోనూ సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, గృహ మరియు కార్యాలయాల అవసరాలకు సౌర విద్యుత్ వినియోగం వలన కలిగే ప్రయోజనాలను, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని ప్రజలకు వివరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఏ.పి.సి.పి. డి.సి.ఎల్. ఎస్.ఈ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డి.ఆర్.డి.ఏ, మెప్మా పి.డి.రవికుమార్, సోలార్‌విద్యుత్ ఏజెన్సీలప్రతినిధులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి



మద్దిపాడు, మేజర్‌న్యూస్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మద్దిపాడు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం మండల కేంద్రం మద్దిపాడుకు చెందిన సీతమ్మ (80) అనే వృద్ధురాలు మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఆమె గురువారం అర్ధరాత్రి 11:30 గంటల సమయంలో మద్దిపాడు సమీపంలోని జాతర రెస్టారెంట్ వైపు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అమిత్ షా మంత్రి పదవికి రాజీనామా చేయాలి

### – 30న ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన

### – జయప్రదం చేయాలని వామపక్ష పార్టీ నేతల పిలుపు



ఒంగోలు, మేజర్‌న్యూస్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాను ఆ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని నామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ ఈనెల 30వ తేదీ ఒంగోలు, కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజనల్ కేంద్రాల వద్ద జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఒంగోలు సుందరయ్య భవన్లో శుక్రవారం జరిగిన పాత్రికే యుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానకరంగా పార్లమెంట్ సాక్షిగా దూషిం చిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ రాజీనామా చేయాలని దేశ వ్యాప్తంగా వామపక్షాలు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయ న్నారు. దేశమంతా నేడు అమిత్ షా చర్యలను ఖండిస్తున్నా ఆయన ఏమాత్రం తగ్గటం లేదన్నారు.ఈనెల 30న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం జరుగుతుందని, అందులో భాగంగా ఒంగోలు, కనిగిరి మార్కాపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు మద్దతు ఇచ్చి పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని అవమానించే విధంగా కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో వ్యాఖ్యానిం చారన్నారు. వ్యతిరేకించే శక్తులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఎంఎస్ సాయి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లూరి మురళి, సిపిఐ నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు. కె. వీరారెడ్డి, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎల్.రాజశేఖర్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



మద్దిపాడు, మేజర్‌న్యూస్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా ఇరువురికి స్వల్ప గాయాలను ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ప్రకారం మండల పరిధిలోని పెద కొత్తపల్లి గ్రామం అరుంధతి నగర్ చెందిన జె.పౌలు అలియాస్ పవన్ కుమార్ పెద్దకొత్తపల్లి డొంక వద్ద జాతీయ రహదారిని దాటి వచ్చే క్రమంలో ఒంగోలు నుంచి శివరాంపురం వెళ్తున్న బైక్ ఢీకొనడంతో బలంగా ఢీకొనడం జరిగింది. ఈ ప్రమాదంలో పౌలుకు ఎడమ కాలు మోకాలు వద్ద కీళ్లు తప్పి కాలు మెలకు తిరిగిపోయింది. బైక్‌పై వస్తున్న దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం ద్వారా వైద్య నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

## మల్టీప్లెక్స్ కంపెనీ రైతులకు అవగాహన

కొత్తపట్నం, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలోని వెంకటరంగం కళ్యాణ మండపంలో రైతులకు మల్టీప్లెక్స్ ఎరువులు పట్ల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మల్టీప్లెక్స్ సౌత్ ఇండియా హెడ్ నారాయణస్వామి మాట్లాడుతూ వేరుశనగ, మిర్చి పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్క్రీన్‌పై వివరించడం జరిగింది. ఈ కంపెనీలో రూ.250లు చెల్లించి ఇన్సూరెన్స్ రైతులపై చేసుకోవచ్చని తెలియజేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడి పొందే విధంగా ఎలా వ్యవసాయం చేయాలో వివరించారు. సాగు చేసేటప్పుడు పంటలకు వస్తున్న తెగులను తట్టుకొని రోగ నిరోధక శక్తి పెంచాలంటే ఏ విధమైన మందులు వాడాలో తెలపడం జరి గింది భూమిని ముందస్తుగా భూసార పరీక్ష చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్టీప్లెక్స్ సౌత్ ఇండియా హెడ్ డాక్టర్ నారాయణ స్వామి, ఏపీ స్టేట్ హెడ్ టి.సుధాకర్ రెడ్డి, డిప్యూటీ ఏరియా సేల్స్ మేనేజర్ శ్రీనివాసరావు, సేల్స్ రిప్రజెంటేటివ్స్ తిమోతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


### ధ్రువీకరణ

భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు గ్రామానికి చెందిన గేదెల శ్రీనివాసరావు తెలియజే యునది. నా భార్య పేరు గేదెల శ్రీ కృష్ణవేణి అలియాస్ గేదెల కృష్ణవేణి. ఒక్కరే అని తెలియ జేయుచున్నాను. ఈ విషయంపై ఎవరికైనా అభ్యంతరం ఉన్నచో ఈ నెంబరుకు తెలియ చేయగలరు.

ఇట్లు
**గేదెల శ్రీనివాసరావు.**
**92969 06729.**

# ఎస్టీ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



బాపట్ల, మేజర్‌న్యూస్: గిరిజన ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. గిరిజనుల ప్రత్యేక సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజనుల సమస్యలను అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని అన్నారు. గత గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కార విషయమై ఆయా శాఖల అధికారులతో ఆరా తీశారు. పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులను వచ్చే గ్రీవెన్స్ నాటికి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కరించాలని తెలిపారు. గ్రీవెన్స్ కు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆయన ఆదేశించారు. గ్రీవెన్స్ లో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పీజీఆర్ఎస్ పోర్టల్ లో నమోదు చేయాలని ముఖ్య ప్రణాళిక అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బాపట్ల మరియు చీరాల ఆర్డీవో పి గ్లోరియా, చంద్రశేఖర్, జిల్లా అధికారులు, వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఛార్జీలు బాదుడుపై వైసీపీ నిరసన ర్యాలీ, ధర్నా




సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మాజీ మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ చార్జీల పెంపుదలపై కూటమి ప్రభుత్వ నిరంకుశ తీరుపై వైయస్సార్సీపి పోరుబాటలో భాగంగా ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఎన్నికల ముందు నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన హామీలు అబద్ధాలు, మోసాలు మళ్లీ ఒకసారి రుజువవుతున్నాయని, వాటిని ప్రజలు గమనించాలని కోరారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కారని చంద్రబాబుపై మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు చెల్లించలేక పేదలు చీకటిలో మగ్గాల్సి వస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఒకపక్క వ్యాపారస్తులు మరోపక్క రైతుల పొలాల్లో బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని, మాజీ మంత్రి నాగార్జున డిమాండ్ చేశారు. వైఎస్సార్సీపీ పోరుబాట కార్యక్రమం నియోజకవర్గ కేంద్రమైన సంతనూతలపాడులోని పార్టీ ఆఫీస్ నుంచి ర్యాలీగా సంతనూతలపాడు బస్టాండ్ మీదుగా విద్యుత్ సబ్ స్టేషన్ వరకు వైసిపి నాయకులు తరలి వచ్చారు. వైసీపీ పోరుబాట కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఐ.పిచ్చి రెడ్డి, మారెళ్ళ బంగారు బాబులు జిల్లా వైసిపి మహిళా అధ్యక్షురాలు జడ్పీటీసీ దుంపా రమణమ్మ, చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు సంతనూతలపాడు చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల వైసిపి అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, మండవ అప్పారావు, పి. శ్రీమన్నారాయణలు, మండలాల ఎంపిపిలు యద్దనపూడి శ్రీనివాసరావు, బుడంగుంట విజయ, వాకా అరుణ కోటిరెడ్డి, ఎన్.అంజమ్మ కృష్ణారెడ్డి, చీమకుర్తి మునిసిపల్ చైర్మన్ గోపురపు రాజ్యలక్ష్మి చంద్ర, చీమకుర్తి పట్టణ అధ్యక్షులు కిష్టపాటి శేఖర్ రెడ్డి, జెసిఎస్‌లు దుంపా యలమందరెడ్డి, మండవ వెంకటనారాయణ, మంచా హరికృష్ణ, ఎస్.విజయ భాస్కరరెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ చల్లా అంకులు, కౌన్సిలర్లు టి.బాబురావు, పత్తి కోటయ్య, ఎస్.శేషాద్రి, ఆముదాలపల్లి ప్రమీల రాంబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీల పెంపును తగ్గించాలి



చీరాల, మేజర్‌న్యూస్: వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఏపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ చీరాల విద్యుత్ డిఈ కార్యాలయం ఎదుట వైయస్సార్సిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో ఆందోళనచేపట్టారు. ముందుగా దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్లకార్డులతో విద్యుత్ డిఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ బాబు మాట్లాడుతూ కరెంటు చార్జీలు తగ్గించాలంటూ డిమాండ్ చేశామన్నారు. తక్షణమే ఏపీ ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## భైరవకోన జలపాతం జల పరవళ్లు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోన జలపాతం వద్ద గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి నీరు అధికంగా రావడంతో ఉధృతంగా జలపరవళ్లు ప్రవహిస్తున్నాయి. ఎత్తయిన కొండల నుండి పడుతున్న జలధారకు జలపాతం ఉధృతంగా ప్రవహిస్తూ శ్రీత్రిముఖ దుర్గభర్గులేశ్వరస్వామి దేవస్థానం ముందు జలకళ సందడి నెలకొన్నది. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం భైరవకోన ఇఓ డి.వంశీకృష్ణారెడ్డి సూచనల మేరకు స్థానిక యస్ఐ ఆర్.సుమన్ దేవస్థానం సిబ్బంది పరిస్థితులను సమీక్షించి భైరవకోన రహదారి మధ్యలో వాగులు, వంకల వద్ద జలపాతం వద్ద నీటిప్రవాహం ఉధృతంగా ఉండటంతో భక్తులు పర్యాటకులు తగు జాగ్రత్తలు సూచిస్తూ తగిన ఏర్పాట్లు చేసి భక్తులు పర్యాటకులకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



## భద్రావతి భావన ఋషి దేవస్థానం అధ్యక్షులుగా దివి శ్రీనివాసరావు



చెరుకుపల్లి, మేజర్‌న్యూస్: స్థానిక ఉత్తర బజారి భద్రావతి భావన ఋషి దేవస్థానం అధ్యక్షులుగా దివి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. శుక్రవారం భద్రావతి భావన ఋషి దేవస్థానంలో రాష్ట్ర టిడిపి బీసీ విభాగం ఉపాధ్యక్షులు దివి రాం బాబు అధ్యక్షతన పద్మశాలి సంఘం నాయకులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా. పద్మశాలి సంఘ నాయకులు అందరూ ఏకగ్రీవంగా దివి శ్రీనివాసరావుకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కందుల వెంకటేశ్వరరావు, అందె సాంబశివరావు, పెనుమర్తి రత్తయ్య, పట్టెం వెంకటకృష్ణారావు పెద్దలు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శుక్రవారం మన్మోహన్ సింగ్ మృతి పట్ల తన ప్రఘాఢ సంతాపం తెలుపారు. తన మేధాశక్తితో దేశాన్ని ముందుకు నడిపిన ధీరుడు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా కోట్లాది మంది శ్రామికులకు ఉపాధి కల్పించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన మహనీయుడు మన్మోహన్ సింగ్ అని, రైతు చదువుకోవాలని ఆకాంక్షించిన మహోన్నత వ్యక్తి అని, వారి మరణం భారతదేశానికి తీరనిలోటని అన్నారు. తన ఆర్థిక సంస్కరణల ద్వారా భారతదేశాన్ని అన్ని విధాల అభివృద్ధి, ప్రగతి పథంలో పయనింపచేసిన మహనీయుడు మన్మోహన్ సింగ్ అని అభివర్ణించారు. 33 సంవత్సరాల పాటు రాజ్యసభ సభ్యునిగా, 10 సంవత్సరాల పాటు భారతదేశ ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా, భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, అనేక ఆర్థిక రంగాల్లో బాధ్యతలు నిర్వహించి, ఆయా పదవులకే వన్నె తెచ్చిన ఆర్థిక మాంత్రికుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి కలగాలని అశోక్ రెడ్డి భగవంతుణ్ణి ప్రార్థించారు.

# మాజీ ప్రధాని మరణం పట్ల డాక్టర్ ఏలూరి సంతాపం



మార్కాపురం, మేజర్‌న్యూస్: భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ మరణం పట్ల బీజేపీ రాష్ట్ర నాయకుడు డా.ఏలూరి రామచంద్రారెడ్డి తన సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుడిగా, ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక సలహాదారుగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, భారతదేశ ప్రధానమంత్రిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎన్నో పదవులు చేపట్టి ప్రజోపకార కార్యక్రమాలు నిర్వహించారన్నారు. మన్మోహన్ గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త అని వ్యాఖ్యానించిన ఏలూరి. ఆయన ప్రజలకు మంచి చేయడానికి ప్రయత్నం చేసినప్పటికీ ఆనాడు కొందరు కాంగ్రెస్ నాయ కులు సహకరించకపోవడం దురదృష్టకరం అన్నారు. పెద్దపెద్ద ప్రసంగాలు చేయకుండా మితంగా స్పందించాలనే మార్గాన్ని మన్మోహన్ ఎంచుకున్నారని వారి మార్గాన్ని కొందరు అనుసరిస్తున్నారన్నారు. ఏడుగురు ప్రధాన మంత్రులతో కలిసి పనిచేసిన అనుభవం మన్మోహన్‌ది అని ఈ సందర్భంగా ఆయనకు తన నివాళులు అన్నారు ఏలూరి. కాగా అనారోగ్యం కారణంగా మన్మోహన్ సింగ్ గురువారం కన్నుమూసిన విషయం తెలిసిందే.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించిన గొల్లపల



బాపట్ల మేజర్ న్యూస్: బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆదేశానుసారం బాపట్ల పట్టణ అధ్యక్షులు గొల్లపల శ్రీనివాసరావు,బాపట్ల మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షులు ఏపూరి భూపతి రావు చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేయడం జరిగినది. చెక్కులు పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి: బాపట్ల పట్టణం చెందిన రావిపాటి కౌసల్య కి రూ.75,833/- లు, బాపట్ల పట్టణ 20వ వార్డు చెందిన నల్లమల్లి లక్ష్మీపార్వతి కి రూ.65000/- లు, బాపట్ల పట్టణం 9వ వార్డుకి కూచిపూడి ఇస్సాకు కి రూ.35000/- లు, బాపట్ల మండలం పిన్నిబోయిన వారిపాలెం గ్రామానికి చెందిన మద్దిబోయిన కోటేశ్వరమ్మ కి రూ.1,99,758/- లు, బాపట్ల మండలం జమ్ములపాలెం గ్రామానికి చెందిన కుర్రా శ్రీ లక్ష్మీ కి రూ.1,72,891/- లు, బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన ఏ జయలక్ష్మి కి రూ.1,62,000/-లు. బాపట్ల మండలం మర్రిపూడి గ్రామానికి చెందిన దమ్ము కనకరత్నం కి రూ.1,29,650/-లు, బాపట్ల మండలం ఆసోదివారిపాలెం కి చెందిన ఆసోది శ్రీనివాసరెడ్డి కి రూ.95,159 లు, బాపట్ల మండలం పిన్నిపోయిన వారిపాలెం గ్రామానికి చెందిన గోనబోయిన శ్రావ్య కి రూ.92,245/- లు, బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన కొండపాటూరు అంకమ్మ కి రూ.70,734/- లు, బాపట్ల మండలం చుండూరు పల్లి గ్రామానికి చెందిన మన్నెం శ్యాం సత్య మహేష్ కి రూ.31,089/- లు, బాపట్ల మండలం కంకటపాలెం గ్రామానికి చెందిన ఉటుకూరి సుబ్బాయమ్మ కి రూ.30,000/- లు, బాపట్ల మండలం పూండ్ల గ్రామానికి చెందిన కర్పాటి వెంకటేశ్వర్లు కి రూ.25,000/- లు, కర్లపాలెం మండలం కొత్తనందాయపాలెం గ్రామానికి చెందిన పి.వెంకటేశ్వర రెడ్డి కి రూ.2,61,287/- లు, కర్లపాలెం మండలం పెద్దగొల్లపాలెం గ్రామానికి చెందిన పి సుజాత కి రూ.50,895/- లు, కర్లపాలెం మండలం పేరలి గ్రామానికి చెందిన మేకల సుశీల రావు కి రూ.40,180/- లు, కర్లపాలెం మండలం మల్లెలవారి పాలెం గ్రామానికి చెందిన ఏపూరి మరియమ్మ కి 35,000/- లు, కర్లపాలెం మండలం దమ్మన్నవారి పాలెం గ్రామానికి చెందిన ఎన్.కనకరాజు కి రూ 32324/- లు, కర్లపాలెం మండలం పెదపులుగువారి పాలెం గ్రామానికి చెందిన వారి బ్రహ్మానంద రెడ్డి కి రూ.31,377/- లు, కర్లపాలెం మండలం మార్పు వారి పాలెం గ్రామానికి చెందిన మార్పు మరియమ్మ కి రూ.20,400/- లు, మొత్తం కలిపి రూ.16,55,822/- ల నగదు చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# భట్టిప్రోలు కవయిత్రికి స్వర్ణ నంది పురస్కారం



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన భట్టిప్రోలు గ్రామానికి చెందిన కవయిత్రి దొంతు ప్రభావతికి స్వర్ణ నంది పురస్కారం లభించింది. కళా నిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్వర్ణ నంది పురస్కారాల మహోత్సవంలో ప్రభావతి ని స్వర్ణ నంది పురస్కారముతో సత్కరించారు.గత 26 సంవత్సరాలుగా ఎంతో మంది కవులను,కళాకారులను ప్రోత్సహిస్తూ స్వర్ణ నంది అవార్డులను ప్రధానం చేస్తున్న కళానిలయం సాంస్కృతిక సంఘసేవ సంస్థ నిర్వాహకులు ఏ.సురేందర్,పుష్పలత దంపతులు ఎంతో మంది కవులను, కళాకారులను ప్రోత్సహిస్తూ ఎంతో ఘనంగా స్వర్ణ నంది అవార్డు లను బహుకరించి,సన్మాన సభా కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి వకుళాభరణం కృష్ణ మోహన్ రావు(బీసీ కమిషన్ ఫార్మర్ చైర్మన్),సభాధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్తా (విశ్వంబర.సి.ఈ.ఓ)గౌరవ అతిథులు సుంకర సత్యనారాయణ(ఫార్మర్ డిసిపి) అనూప్. గాడిపల్లి (యూత్ లీడర్ అండ్ ఫ్యాషన్ ఐకాన్) ప్రభుదాస్(కార్పొరేటర్ హెచ్ బీ కాలనీ)కె.వీరభోగ వసంత రాయులు(సమాజ సేవకులు), డాక్టర్ చింత పట్ల వెంకటాచారి(తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రెసిడెంట్)బండ సంగారెడ్డి(సీనియర్ జర్నలిస్ట్ ప్రముఖ సామాజికవేత్త), తిరువాయిపేట పురుషోత్తం అయ్యర్యార్(అర్చక పురోహితులు), హైకోర్టు అడ్వకేట్ ("లాయర్స్ లాంగ్" తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ)కుమార్ లయన్ హాజరై తమ అమూల్యమైన సందేశాన్ని అందించి,స్వర్ణ నంది పురస్కారాలు,స్వర్ణ నటరాజ పురస్కారాలను అందించి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.

# సదస్సుల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం: ఎమ్మెల్యే కందుల



కొనకనమిట్ల, మేజర్‌న్యూస్ : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని మార్కాపురం శాసన సభ్యులు కందులు నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మునగపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై మాట్లాడారు. తహసిల్దార్ ఆవుల సురేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులు ఎమ్మెల్యే మాట్లాడుతూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపాలని తహసిల్దార్ను ఆదేశించారు.గత ప్రభుత్వం దుర్మార్గ పాలన చేసి ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రజలకు చేరువయ్యే విధంగా పరిపాలన చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడం జరిగిందన్నారు. భూములకు రక్షణ కల్పించే విధంగా ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. భూములు మద్యంపై దృష్టి సారించి ప్రజల బాగోగులు పట్టించుకోలేదని గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు . ఐదు సంవత్సరాలలో గ్రామాలలో రోడ్డు లేవు,మట్టి పోయలేదు గుంతలలో ప్రజానీకం ప్రయాణం చేయాల్సిన దుస్థితి కల్పించిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన కోసం యువ నాయకుడు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వివిధ దేశాలు తిరిగి ప్రాజెక్టులు తెచ్చేందుకు నిరంతరం కష్టపడుతున్నారు. ఎమ్మెల్యే వెళ్లిన అనంతరం కనిగిరి ఆర్డిఓ కేశవర్ధన్‌రెడ్డి రెవిన్యూ సదస్సు పాల్గొని అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్ఐ మహాదేవరెడ్డి, సర్వేయర్ రాజశేఖర్,వీఆర్వో రమేష్ పలువురు వీఆర్వోలు, టిడిపి నాయకులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కనకం నరసింహారావు, పుల్లగూర శ్రీను, కైపు అంజిరెడ్డి, వీరాంజనేయ రెడ్డి, కేవిరా రెడ్డి, డివి ప్రసాద్, సిహెచ్ రమణా రెడ్డి, మండల బీసీ సెల్ నాయకులు అంకాల రోశయ్య, వైఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు అభివృద్ధి కోసం అందరూ సహకరించాలి

### – రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర –

హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని హనుమంతునిపాడు గ్రామంలో ఓవి రోడ్ నిర్మాణం కొరకు రెవెన్యూ అధికారులు రోడ్డు విస్తరణ కొలతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నర్సింహారెడ్డి శుక్రవారం రోడ్డు విస్తరణ కొలతలను పరిశీలించి కొలతలలో రోడ్డు విస్తరణ కొరకు కొన్ని గృహాలు అడ్డు రావడంతో నష్టపోయిన గృహ యజమానులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం ప్రభుత్వ ఇండ్లు మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ కత్తి కిషోర్, తాతిపూడి వీరనారాయణరెడ్డి, గాయం రామిరెడ్డి, కత్తి తిరుపాలు, గంట రవీందర్ రెడ్డి, యక్కంటి విష్ణువర్ధన్ రెడ్డి, కత్తి తిరుపాలు, యలనాటి చిన్నకోటయ్య, తదితర తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ధ్వజస్థంభం పూజలో ముత్యాల భారతినారాయణరెడ్డి



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని అయ్యలూరివారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక దేవస్థానం వద్ద ప్రతిష్ఠ చేయనున్న ఏకశిల ధ్వజ స్థంభానికి సర్పంచ్ ముత్యాల భారతి నారాయణరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ముందుగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేదమంత్రోచ్ఛరణాల మధ్య కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల భారతి నారాయణరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమానికి కృషి

### విశ్రాంత పోలీసు అధికారుల ఆత్మీయ సన్మానంలో ఎస్పీ ఏఆర్ దామోదర్



ఒంగోలు, మేజర్‌న్యూస్: పోలీసు శాఖలో సుదీర్ఘ కాలంపాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ప్రకాశం జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంఘం శుక్రవారం పోలీస్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. రిటైర్డ్ పోలీసులలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 16మంది పోలీస్ అధికారులను మరియు వారి కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండి వారి సాధకబాధకాల్లో మమేకమై సేవలందించే అవకాశం పోలీసుశాఖలోనే అధికంగా ఉంటుందని, పోలీసులు విధి నిర్వహణలో వారి ఆరోగ్య ప్రాధాన్యత కంటే ప్రజా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని, కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించారని వారిని ప్రశంసించారు. సుదీర్ఘకాలంపాటు శాంతిభద్రత, నేర నియంత్రణ, బందోబస్తులు, ఇతర విధులు చేసారని వారికి పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల, సిబ్బంది అనుభవాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణారెడ్డి, విశ్రాంతి అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వెలుగొండరాయునిపల్లి బీసీ కాలనీలో పర్యటించిన కాసు



కొనకనమిట్ల, మేజర్‌న్యూస్ : కాసు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాసు వెంకటేశ్వర్ రెడ్డి శుక్రవారం గొట్లగట్టు పంచాయితీ వెలుగొండరాయునిపల్లి బీసీ కాలనీలో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న రామాలయాన్ని ఆయన పరిశీలించారు. రామాలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలని గ్రామస్తులు కాసును కోరారు. అందుకు స్పందించిన కాసు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాసు వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకుని తాము నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి: తహసీల్దార్



పొదిలి, మేజర్‌న్యూస్: గ్రామ రెవెన్యూ సదస్సులు వినియోగించుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసిల్దార్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ మాదిరెడ్డి పాలెం రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమం మండల టిడిపి కన్వీనర్ మీగడ ఓబుల్ రెడ్డి, జిల్లా తెలుగు యువత నాయకులు దామిరెడ్డి అంజిరెడ్డి, బలగాని పెదరాజు, మీగడ ఓబుల్‌రెడ్డి, గ్రామ ప్రజలు రైతులుఅధికారులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# రేపు రాష్ట్ర వ్యాప్తంగా లచ్చన్న విగ్రహాల శుద్ధికి పిలుపు



బాపట్ల మేజర్‌న్యూస్: రాజకీయాలకు అతీతంగా, సమాజంలోని అన్ని వర్గాల, అన్ని తరగతుల వారు హాజరై గౌతు లచ్చన్నకు ఘనంగా నివాళులర్పించి, విగ్రావిష్కరణతో తమ హర్షాతిరేకాలను తెలియజేస్తే రాజకీయ-ప్రజాప్రతినిధులు కొందరు సంకుచిత ధోరణిగా స్పందించడం అనైతికమని కేసన శంకరరావు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన విశ్వశాంతి ఉన్నత పాఠశాల సమీపంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నూజివీడులో కీర్తిశేషులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ సందర్భంగా చోటు చేసుకున్న సంఘటనలు- తదనంతర పరిణామాలకు ప్రతిస్పందనగా, బీసీల ఐక్యతే లక్ష్యంగా పని చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఆయా ప్రాంతాల్లో ఉన్న గౌతు లచ్చన్న విగ్రహాలకు పలువురు బీసీ నాయకులు ఈ నెల 29వ తేదీన పవిత్ర నదీ జలాలతో, పాలాభిషేకం చేసి శుద్ధి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రాయశ్చిత్త కార్యక్రమంతో స్వాతంత్ర సమరయోధుడు, రైతు బాంధవుడు, పేదల పెన్నిధి, బడుగుల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ సందర్భంగా నూజివీడులో చోటు చేసుకున్న దురదృష్టకర సంఘటనలు విచారకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బీసీ నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కుల,మత, ప్రాంత,జాతి రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమం, సమాజ సాధికారత కోసం కృషి చేసిన అందరివాడైన గౌతు లచ్చన్నను గౌరవించు కోవాలన్నారు. ఘనంగా వారికి నివాళులర్పించుకోవడం ప్రజలందరి బాధ్యతన్నారు. ఆధునిక ప్రజాస్వామ్య యుగంలో కూడా లచ్చన్న విగ్రహావిష్కరణ సందర్భంగా రాజకీయుల మధ్య నెలకొన్న అనిచిత తొలగిపోవాలన్నారు. వారి మానసిక పరిణితిని తెలియజేస్తుందన్నారు. అనంతరం రైలుపేటలోని మాజీ కౌన్సిలర్ పరిశా రమేశ్ భార్య ఇటీవల పరమధించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, జిల్లా కార్యదర్శులు ఎన్ ఎస్ పి రాజు, మారం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న మినుము పంటలను పరిశీలించిన జేడీఏ

పామూరు, మేజర్‌న్యూస్: గత మూడు రోజుల నుంచి వర్షాలు కురవడంతో మినుము పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంటలు తుఫాను ప్రభావంతో దెబ్బ తినడంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతుంది. దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు మినుము పంటలను పరిశీలించారు. శుక్రవారం మండలంలోని రావిగుంటపల్లి పంచాయతీ పరిధిలో మెట్ట ప్రాంతాలలో సాగుచేసి కోత దశలో ఉన్న మినుము పంటలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మూడు రోజుల నుంచి కురిసిన వర్షానికి విత్తనాలు మొలకెత్తుతున్న విషయాన్ని రైతులు జేడీఏ దృష్టికి తీసుకెళ్లారు.

వేలాది రూపాయలు అప్పులు చేసి పంటల సాగు చేసామని చేతికందే సమయంలో వర్షం కురవడంతో నిండా మునిగిపోయామని మమ్మల్ని ఆదుకోవాలని వేడుకొన్నారు. మినుము పంట సాగు చేసిన రైతన్నలను ఆదుకునేందుకు జిల్లా అధికారులకు సమగ్ర నివేదికను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కనిగిరి ఏడిఏ ఏవి. రమణా రావు, పామూరు మండల వ్యవసాయాధికారి కె.రాధ, వ్యవసాయ సిబ్బంది, టిడిపి నాయకులు కంచర్ల శ్రీనివాసులు, రెక్కల వెంకట రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలుకు బస్సు ఏర్పాటు చేయాలి



పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రముకు వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని సిపిఐ మండల కార్యదర్శి అన్నారు. శుక్రవారం మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ రోడ్డు సర్వే నిమిత్తం సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు గురునాథం డిపో మేనేజర్‌తో మాట్లాడుతూ బస్సు సెంటర్లో వసతులు లేవని కనీసం మహిళలకు బాత్రూములు దాతలతో కట్టించిన నీటి వసతులు కూడా లేవని అన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రానికి తెల్లవారు జామున 5గంటల సమయంలో బస్సు ఏర్పాటు చేయాలని అన్నారు, మండల సమస్యలను జిల్లా అధికారులకు విన్నవించుకోవాలన్నా కలెక్టర్ గ్రీవెన్స్‌లో సమస్యలు తెలియజేసుకోవాలన్న ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. మార్కాపురం కేంద్రం నుండి వయా మండల కేంద్రమైన పుల్లలచెరువు మీదుగా హైదరాబాద్ బస్సులు ఏర్పాటు చేయాలని ఉద్యోగాలు చేసేవాళ్లు వ్యాపారి నిమిత్తం హాస్పిటల్ ఇతర పనుల మీద నిత్యం హైదరాబాద్ వెళ్తారని, పరిశీలించి వెంటనే బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. బస్ సెంటర్లో కనీసం లైట్లు కూడా లేవని చుట్టూ చెత్తాచెదారంతో నిండిందని ప్రయాణికులు కూర్చోవాలన్న ఇబ్బందులు పడుతున్నారని వాటిని కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరారు.

## డాక్టర్ రంగారెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కేపీ



గిద్దలూరు, మేజర్‌న్యూస్: ఇటీవల అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ వైసీపీ నాయకులు డాక్టర్ రంగారెడ్డిని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి కేపీ నాగార్జున రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకు న్నారు. వారి వెంట పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీనారాయణస్వామి దేవస్థానంలో నాగేంద్రస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీమిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆవరణలోని నాగేంద్రస్వామి సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో అర్చకులు యం.ప్రసాదుశర్మ కళశ మండపారాధన ప్రవేశంచేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రత్యేక హోమపూజలు నిర్వహిం చారు. అనంతరం దేవస్థానంలో ప్రదక్షిణలు నిర్వహించి వివిధ పూజలు నిర్వహించి వైభవంగా నాగేం ద్రస్వామి సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఓ నరసింహ బాబు, పలువురు భక్తులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కనిగిరి, మేజర్‌న్యూస్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కనిగిరి పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కనిగిరి మున్సిపాలిటీలో 60 వేలకు పైగా జనాభా 20 వార్డులు ఉండగా 68 మంది కార్మికులు ఎలా సేవలు అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్ ప్రసాద్, ఓబయ్య, లక్ష్మయ్య, రవి, ఆనంద్, ఎలీషా, రవణమ్మ, అంకమ్మ, రోజమ్మ పాల్గొన్నారు.

## నలుగురు వ్యక్తులు అరెస్ట్



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని మోడంపల్లెకు దగ్గరలోని జగనన్న కాలనీ వద్ద గంజాయిని అమ్ముతున్న పాలూరి మాబు షరీఫ్, షేక్ మహబూబ్ బి, దాసరి నాని, అవిజ సునీల్ కుమార్ అనే నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసిన గిద్దలూరు పోలీసులు. ఈ గంజాయి సుమారు 30 వేల రూపాయలు ఉంటుం దని అంచనా. గిద్దలూరు తహసిల్దార్ ఆంజనేయ రెడ్డి. గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్ వారి బృందం ఆధ్వర్యంలో మధ్యవర్తుల సమక్షంలో పట్టుకొని వారిని పోలీస్ స్టేష న్కు తరలించారు. విలేకరుల సమావేశం నిర్వహించి ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టుకు పంపిస్తు న్నట్టు మార్కాపురం డిఎస్పి యు.నాగరాజు తెలిపారు. కార్యక్ర మంలో మార్కాపురం డిఎస్పి యు.నాగరాజు, అర్బన్ సిఐ సురేష్, ఎస్సై ఇమ్మానుయేల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ బూత్ కమిటీలను త్వరగా పూర్తి చేయాలి



గిద్దలూరు, మేజర్‌న్యూస్: అసెంబ్లీ బూత్ కమిటీల సమీక్షా సమావేశం జిల్లా ఎన్నికల రిటర్నింగ్,రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు షేక్ బాజి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్చార్జి రవి శంకర్,జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షులు ఖుద్దస్ పాల్గొన్న సమావేశంలో షేక్ బాజి మాట్లాడుతూ ప్రతి మండల అధ్యక్షులు వారి మండలాలలో ఉన్న బూత్ కమిటీల నియామకం త్వరగా పూర్తి చేయాలని,బూత్ కమిటీ 12 మందితో పూర్తి చేయాలని సూచించడం జరిగింది. ఈ బూత్ కమిటీల నియామకం తరువాత మం డల అధ్యక్షుల నియామకం జరుగుతుంది అని తెలియ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జెవి నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ, జిల్లా ఎస్‌సి మోర్చ ప్రధాన కార్యదర్శి మట్టేమల్ల పుల్లయ్య, సీనియర్ నాయకులు కె.చంద్ర మోహన్, రాష్ట్ర 56 సంఘాల కన్వీనర్ కేతిగుంట్ల సుబ్బారాయుడు, సీనియర్ నాయకులు రాచర్ల కాసులు, జిల్లా ఒబిసి ప్రధాన కార్యదర్శి బాదుళ్ళ, పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వర రావు, జిల్లా మేధో కమిటీ మెంబర్ రెడ్డి మల్లారెడ్డి, రాచర్ల మండలం అధ్యక్షులు రాజ గోపాల్ రెడ్డి, గిద్దలూరు రూరల్ అధ్యక్షులు కె.తిరు పాల్ రెడ్డి, కొమరోలు అధ్యక్షులు వెంకట రామిరెడ్డి, బేస్తవారీ పేట మండలం అధ్యక్షులు మొర్రి వెంకట రమణ, పట్టణ ఒబిసి అధ్యక్షులు కొప్పుల నరసింహులు, అసెంబ్లీ ఎస్‌సి మోర్చా ఇంఛార్జి బండారి జయ ప్రసాద్ పాల్గొనడం జరిగింది.

# రెవెన్యూ భూముల సమస్యల పరిష్కారం ప్రభుత్వ లక్ష్యం




సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో రైతులకు సంబంధించి రెవెన్యూ భూముల సమస్యల పరిష్కారం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రైతులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల తహశీల్దార్ డి.మంజునాథరెడ్డి, పలువురు నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సిఎస్‌పురం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించి సమస్యలను తగిన ఆధారాలు తీసుకుని తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి సక్రమంగా ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించడానికి కృషిచేస్తామని అదేవిధంగా భూముల రికార్డుల తప్పుల సవరణ ఇతర సమస్యలను పరిష్కరించుకోవాలని తహశీల్దార్ అన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై 25మంది ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ డి.మంజునాథరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, సర్పంచ్ శ్రీరాంపద్మావతి, ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, టిడిపి నాయకులు యన్.సి.మాలకొండయ్య, బొబ్బూరి రమేష్, బత్తుల వెంకటాద్రి, రెవెన్యూ సిబ్బంది, దేవాదాయ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మొబైల్ షాపుల యూనియన్ అధ్యక్షుడిగా మహేష్



రేపల్లె, మేజర్‌న్యూస్: మొబైల్ షాపుల యూనియన్ అధ్యక్షుడిగా రాసంసెట్టి మహేష్ ఏకగ్రీవంగా ఎంపిక య్యారు. పట్టణంలో శుక్రవారం జరిగిన యూనియన్ ఎన్నిక ల్లో రాసంసెట్టి మహేష్ ను వరుసగా ఐదవ సారి యూనియన్ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మొబైల్ షాప్ యజమానులు యూనియన్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మొబైల్ షాపుల యజమానుల కు సంబంధించిన సమ స్యల పరిష్కారం కొరకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి యూని యన్ సభ్యులకు ఉచిత ఇన్సూరెన్స్ సౌక ర్యాన్ని ఏర్పాటు చేసి వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని చెప్పారు. అనంతరం భారతదేశ మాజీ ప్రధాని ప్రముఖ ఆర్థికవేత్త, మన్మోహన్ సింగ్ కు నివాళులర్పించారు.

# వైసీపీలో కన్వీనర్ పదవిపై వీడని ఉత్కంఠ



పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: మండలంలో గత సంవత్సర కాలం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మండల కన్వీనర్ పదవి ఖాళీగా ఉండటంతో ఈ పదవిని భర్తీ చేసేందుకు శుక్రవారం ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పుల్లలచెరువు మండలంలోని ఎంపీపీ జడ్పీటిసి ఎంపీటీసీలు సర్పంచులు మండల స్థాయి నాయకులు గ్రామస్థాయి నాయకులు వివిధ విభాగాల అధ్యక్షులు కార్యకర్తలతో పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ మండల కన్వీనర్ పదవి కోసం ఎవరెవరు ఆశిస్తున్నారో వారి అభిప్రాయాలు తెలియజేయమని చెప్పగా మండలం నుండి దాదాపు పదిమంది ఆశావాహులు ఈ పదవిపై పోటీపడ్డారు. అయితే ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వారి అభిప్రాయాలను సేకరించి మండలంలో ప్రతి గ్రామము నుంచి వచ్చిన వారితో ఏకాంతంగా మాట్లాడి వారి అభిప్రాయాన్ని సేకరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎవరికైతే మెజార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు మద్దతు చూపారో అలాంటి వారిని అందర్నీ కలుపుకొని పార్టీని ముందుకు తీసుకువెళ్లే సమర్థుడైన నాయకుడ్ని కన్వీనర్‌గా ప్రకటిస్తానని ఈ విషయంపై కొన్ని రోజుల్లో స్పష్టత ఇస్తానని ఆయన తెలియజేశారు.

## ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన అధ్యాపక బృందం



ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపక బృందం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును పార్టీ కార్యాలయంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 2 నుండి ప్రారం భించబోతున్న మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రారంభించడానికి ఆహ్వానించారు. కార్యక్రమం లో ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసరావు, అధ్యాప కులు గారపాటి గోపీచంద్ ప్రకాష్, బి.హ నుమంతరావు చల్లా శ్రీనివాసులు, సీని యర్ అసిస్టెంట్ సిహెచ్ రాము పాల్గొన్నారు.

## మన్మోహన్‌సింగ్‌కు నివాళి



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని పెద్ద దోర్నాలలో బిజెపి మండల కన్వీనర్ సురవరం గండి వీరారెడ్డి మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థిక వేత్త, సరళీకృత ఆర్థిక విధానాల రూపకర్త మన్మోహన్ సింగ్ మరణం దురదృష్టకరమన్నారు. ఆయన భారత దేశానికి చేసిన సేవలు ప్రజల హృదయాలలో ఆయనను చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటూ ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## లోకల్ ఏరియా బ్యాంకు



కొల్లూరు, మేజర్ న్యూస్: గ్రామీణ ప్రాంతంలో నెలకొల్పిన కొల్లూరు కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు ను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని ఆ బ్యాంకు మేనేజర్ టి. మనిధర్ అన్నారు. కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు లిమిటెడ్ ఏర్పాటుచేసి 25సంవత్సరాలు సిల్వర్ జూబ్లీ ఉత్సవంలో భాగంగా శు క్రవారం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

## రోటరీ ఆర్థిక సాయం



అద్దంకి, మేజర్‌న్యూస్: రోటరీ ఇంటర్నేషనల్ 2024-25 ప్రెసిడెంట్ స్టెఫని ఏ. ఉర్చిక్ జన్మదిన సందర్భంగా స్థానిక కొత్తపేటలో నివాసముంటున్న బొర్రా ఆదిలక్ష్మి కుమారుడు వెంకటేష్ (10) రక్తంలో ఇన్ఫెక్షన్ తో తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నందున, ఆ పేద బాలుని తక్షణ వైద్య ఖర్చులనిమిత్తం, రోటరీ మిత్రుల సౌజన్యముతో ఆరు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, షేక్ మహమ్మద్ రఫీ, పసుపులేటి ఆంజనేయులు, డాక్టర్ దేవ పాలన, చిన్ని మురళీ కృష్ణ, అద్దంకి లేవి ప్రసాద్, కాకర్ల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికుల ధర్నా

చీమకుర్తి, మేజర్‌న్యూస్: మునిసిపల్ కార్మికుల సమస్యల పరిస్కారం కోసం 2023 డిసెంబర్ 26నుండి 2024జనవరి 10వరకు 16రోజుల సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని మునిసిపల్ వర్కర్స్ &ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) చీమకుర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీఐటీయు నాయకులు పూసపాటి వెంకటరావు, పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ గత సమ్మె సందర్భంగా జరిగిన వ్రాత పూర్వక ఒప్పందాలలో కొన్ని అమలు జరిగాయని, అమలు కాని దహన సంస్కారాలు, ఎక్స గ్రేసీయా పెంపు జి.ఓ.లు నేటికీ ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.పద్మ, ఏడుకొండలు,టి. నరసయ్య, గోవిందు, దాసు,కోటేశ్వరరావు, పిచ్చయ్య, సుబ్బరత్తమ్మ, కళ్యాణి, కోటేశ్వరి, ఆంద్రీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు చీమకుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చీమకుర్తి, మేజర్‌న్యూస్:మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 28వ తేదీ ఉదయం 11గంటలకు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో రాఘవేంద్ర తెలిపారు. కావున సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, పంచాయతీ సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు అందరూ వారి శాఖల ప్రగతి నివేదికతో పాటు సర్వసభ్య సమావేశానికి తప్పని సరిగా హాజరు కావలసిందిగా ఎంపీడీవో రాఘవేంద్ర కోరారు.

## వైసీపీ సీనియర్ నాయకులు పాలగుండ్ల పెద్దనరసారెడ్డి సంస్మరణలో నాయకులు



మర్రిపూడి, మేజర్‌న్యూస్: మండలంలోని అంకేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైయస్సార్సీపి సీనియర్ నాయకుడు పాలుగుండ్ల పెద నరసారెడ్డి (దశదిన) సంస్మరణలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి,మాజీ వైయస్సార్సిపి ఇంచార్జ్ మాదాశి వెంకయ్యలు పాల్గొని పెద్ద నర్సారెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన కుమారుడు పాలగుండ్ల సుబ్బారెడ్డిని మాజీ ఎమ్మెల్యే ఉడుముల, నాయకులు సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బోధ రమణారెడ్డి, నాయకులు పల్లెర నరిసింహారెడ్డి, పాలగుండ్ల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ మాకినేని సుధారాణి, వెంకటరావు, నాయకులు యర్రంరెడ్డి వెంకటరెడ్డి, తానికొండ వెంకట్రావు, ఉడుముల పిచ్చిరెడ్డి, ఎర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి హనీమూన్ శ్రీనివాసరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

పెద్దదోర్నాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని పెద్ద దోర్నాలలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఏరువా మల్లిఖార్జున రెడ్డి మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థిక వేత్త, సరళీకృత ఆర్థిక విధానాల రూపకర్త మన్మోహన్‌సింగ్ మరణం దురదృష్టకరం. ఆయన భారత దేశానికి చేసిన సేవలు ప్రజల హృదయాలలో ఆయనను చిరస్థాయిగా నిలుస్తాయన్నారు.

# విద్యుత్ ట్రూ అప్ చార్జీల పెంపు కర్మ, కర్త, క్రియ జగన్‌రెడ్డి

### కమీషన్లకు కక్కుర్తిపడి రాష్ట్రని దివాలా తీయించిన ఘనుడు జగన్‌రెడ్డి

### రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి అర్వపల్లి



బల్లికురవ, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో కరెంటు ట్రూఅప్ చార్జీల కర్త కర్మ క్రియ అన్నీమాజీ ముఖ్యమంత్రి జగనేనని రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి అర్వపల్లి ఆంజనేయులు ఆరోపించారు. శుక్రవారం వైసిపి నిరసనలపై అర్వపల్లి పత్రిక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ చార్జీల పెరుగుదలకు జగనే కారణమని స్పష్టం చేశారు. పిచ్చి చేష్టలు శాడిస్టు చర్యలతో జగన్ మరోసారి తుగ్లక్‌కి నెనేమీ తీసిపోనని నిరూపించుకున్నాడని అన్నారు. 2014-19 మధ్య విభజనానంతరం రాష్ట్రాన్ని మిగులు విద్యుత్‌లో నిలిపిన చంద్రబాబు డిస్కమ్‌లు విద్యుత్ తయారీ సంస్థలు ప్రజలపై ఎలాంటి భారం వేయకుండా నాణ్యమైన విద్యుత్‌ను రాష్ట్రానికి అందించిన ఘనత చంద్రబాబుదని ఆంజనేయులు అన్నారు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చి రాగానే పిపిఏల రద్దు నిర్ణయంతో రాష్ట్ర విద్యుత్ రంగం నడ్డి విరిచేశాడని అంజనేయులు అన్నారు. జగన్ గత ఐదేళ్ల పాలనలో విద్యుత్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. నాడు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపి నేడు ధర్నాలు ర్యాలీలు చేయడం సిగ్గుచేటని ఆంజనేయులు విమర్శించారు.

యూనిట్ విద్యుత్ రూ.4.65కే వస్తున్నా జగన్ కొనలేదని కమీషన్లకు కక్కుర్తిపడి యూనిట్ విద్యుత్ రూ.8కి కొన్నారని వివరించారు. జగన్ చేసిన పాపాలు నేడు రాష్ట్రానికి శాపాలుగా మారాయని అంజనేయులు తెలియజేశారు.

# భూసమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కరించండి

### పి.నాయుడుపాలెం రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల్‌కృష్ణ



చీమకుర్తి, మేజర్‌న్యూస్: భూ సమస్యలపై ప్రజలు, రైతుల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి, అర్జీలవారీగా పరిశీలన చేసి పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల్ కృష్ణ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం చీమకుర్తి మండలంలోని పి.నాయుడుపాలెం గ్రామంలోని సచివాలయం వద్ద రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటిని పరిష్కారం అయ్యే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలు, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ కోరారు. చీమకుర్తి తహసిల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుకు 8 అర్జీలు రావటం జరిగిందని, స్మశానం ను కొలతలు వేసి హద్దులు నిర్ధారణ చేయుట జరిగిందని, రైతులు భూములకు వెళ్లే డొంకను కొలతలు వేయించి హద్దులు నిర్ధారణ చెయ్యడం జరిగిందన్నారు. రైతుల భూముల సమస్యలు సత్వర పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యం అన్నారు. ఈ సదస్సులో ఎంపీడీవో రాఘవేంద్ర, జిల్లా సర్వే అధికారి గౌస్ భాష, మాజీ సర్పంచ్ కూరాకుల కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి పి శంకర్, ఆర్ ఐ.శ్రీధర్, ఎం.రాజేష్, వీఆర్వో నారపరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ సుబ్రమణ్యం, సచివాలయ ఉద్యోగులు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీర బాల దివాస్ కార్యక్రమం



పొదిలి, మేజర్‌న్యూస్: పొదిలిలో బిజెపి కార్యకర్తల ఆధ్వర్యంలో వీర బాల దివాస్ కార్యక్రమం శుక్రవారం బిజెపి కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి భారతీయుడు వీర్ బాల దివస్ గురించి ఆ చరిత్ర తెలుసుకోవాలని,మన భావితరాలకు తెలియజేయాలన్నారు. అతి చిన్న వయస్సులో దేశం కోసం, ధర్మం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా సమర్పించిన వీర పుత్రులని గుర్తు చేశారు. అతి చిన్న వయసులోనే బలిదానం చేసిన వీర బాలల చరిత్ర నేటి తరానికి తెలియాలి అందరికీ తెలియజేయాలి, పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి ఈ వీరుల గురించి భావిభారత పౌరులకి అవసరం ఉంది. ఈ కార్యక్ర మంలో బిజెపి మండల పదాధిపతులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్షాలకు దెబ్బతిన్న కంది, మినుము పంటలు పరిశీలన



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కంది, మినుము పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి డి.యుగంధర్ రెడ్డి శుక్రవారం సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ మండలంలో మొత్తం మీద రబి సీజన్లో మినుము పంట 335 ఎకరాలు సాగు చేసి ఉన్నారని ఈ వర్షాలకు మినుము చేలల్లో నీళ్లు నిలబడి పంట కాయ దశలో ఉన్నందువలన కాయలోకి వర్షపు నీరు చేరి విత్తనాలు మొలగ రావడం గమనించడం జరిగిందన్నారు. ప్రాథమిక నివేదిక ప్రకారం 335 ఎకరాలు దెబ్బతిన్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయమునకు తయారు చేసిన నివేదికను అందజేసి జిల్లా కలెక్టర్కు మార్గదర్శకాలకు అనుకూలంగా నష్టపరిహారం జాబితాలను అంచనా చేస్తామని రైతులకు భరోసా కనిపించినట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి డి.యుగంధర్ రెడ్డి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.



## కరెంటు చార్జీల బాదుడుపై వైకాపా ఆందోళన

కొండేపి, మేజర్‌న్యూస్: రాష్ట్రంలోని గృహ వినియోగదారులు కరెంటు చార్జీల భారం మోయలేకపోతున్న కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు భారీగా పెంచడంతో ప్రజలు అల్లాడిపోతున్నరని వైకాపా కొండేపి నియోజకవర్గం ఇన్చార్జి మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రం అయినటువంటి కొండేపిలో పోరుబాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది రూపాయలు కరెంటు బిల్లులు కట్టలేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే 200 యూనిట్ల ఉచిత కరెంటును పునరుద్ధరించాలన్నారు ఈ కార్యక్రమంలో మాదాసి వెంకయ్య నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు డిమాండ్స్ తక్షణమే గృహ వినియోగదారులపై మోపిన రూ.15485.36కోట్ల చార్జీల బాదుడు వెనక్కి తీసుకోవాలి, ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా చార్జీల పెంపును నిలిపివేయాలి, ఎస్సీ, ఎస్టీలకు 200యూనిట్లు ఉచితవిద్యుత్ కొనసాగించాలి, వ్యవసాయ పంపు సెట్లకు వెంటనే కనెక్షన్ మంజూరు చేయాలన్నారు.

## అమిత్‌షా ప్రజలకు క్షమాపణలు చెప్పాలి



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని సంతనూతలపాడు అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి మాలతి మాట్లాడుతూ అంబేద్కర్‌ని అవమానపరచడం అంటే రాజ్యాంగాన్ని అవమానపరిచినట్లేనన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, సిఐటియు మండల నాయకులు పి.శివన్నారాయణ, మహిళలు కే.రోశమ్మ, బి.బాలమ్మ, డి.చెన్నమ్మ, జి.వెంకటేశ్వరమ్మ, పి.సృజన తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి తీరనిలోటు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి నన్ను ఎంతగానో తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. మన దేశాభివృద్ధికి వారు సేవలు మారువలేనివి. వారు మన దేశానికి ఎన్నో రకాల సేవలు అందించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థిస్తు వారి కుటుంబ సభ్యులకు నాప్రఘాడ సానుభూతిని ఓం శాంతి పగడాల రంగస్వామి గిద్దలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తెలిపారు.

## దళారుల మాటలు నమ్మొద్దు
# ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు
### పోలీసు కానిస్టేబుల్ ఈవెంట్స్ పకడ్బందీగా నిర్వహిస్తాం
### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ వెల్లడి



ఒంగోలు, మేజర్‌న్యూస్ : పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్స్ ఎంపిక కోసం ప్రిలిమినరీ టెస్ట్ పాసైన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లను ఈనెల 30 నుండి జనవరి 10 వరకు ఒంగోలు జిల్లా పోలీసు పెరేడ్ మైదానంలో జరగనున్నాయి. దేహదారుఢ్య పరీక్షలు ఎటువంటి లోపాలు లేకుండా పటిష్టంగా నిర్వహించాలని, 1600 మీటర్ల పరుగు, 100 మీటర్లు పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్స్ సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని, అభ్యర్థులకు వైద్య శిబిరం, మంచినీరుతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు సమకూర్చుకొని పూర్తిస్థాయిలో మైదానాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశం మొదలుకుని, పరీక్షలు ముగించుకుని మైదానం నుంచి తిరిగి వెళ్ళే వరకు వారికి అర్థమయ్యే రీతిలో ప్రతి పరీక్ష ఘట్టాన్ని సూచించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈవెంట్స్‌కు 5345 మంది అభ్యర్థులు (4435 మంది పురుషులు, 910 మంది స్త్రీలు) పాల్గొంటున్నట్లు తెలిపారు. ఏదైనా పిర్యాదులు ఉంటే constable.recruitment.pkm@gmail.com మెయిల్ చేయాలని, ఏమైనాసందేహాలు ఉంటే హెల్ప్ లైన్ నెంబర్ 9121102266 సలహాలు, సూచనలు పొందవచ్చునని తెలిపారు.

## కలెక్టర్ అన్సారియాను కలసిన డిహెచ్‌ఎంవో



ఒంగోలు, మేజర్‌న్యూస్ : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిగా నూతన బాధ్యతలు స్వీకరించిన డా. డాక్టర్ టి.వెంకటేశ్వర్లు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను కలిశారు. ప్రకాశం భవనంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం పలు విషయాలు మాట్లాడారు. జిల్లాలో వైద్య ఆరోగ్య సేవలు పేద ప్రజలకు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలు అందరికి తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు.

# హెల్మెట్ ప్రయాణం సురక్షితం: డిఎస్పీ శ్రీనివాసరావు
### రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలి
### నగరంలో పోలీసు అధికారులు, సిబ్బంది హెల్మెట్ ధరించి వాహన అవగాహన ర్యాలీ

ఒంగోలు, మేజర్‌న్యూస్ : రోడ్డు భద్రతా నియమాలు పాటించడం మీకు సురక్షితం, మీపై ఆధారపడ్డ కుటుంబానికి ఎంతో క్షేమకరమని ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు అన్నారు. రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు టౌన్‌లోని ప్రధాన కూడలిలో పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని చెప్పారు. హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని, కావున ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాల గురించి, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కలిగించేందుకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ట్రాఫిక్ సిఐ పాండు రంగారావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



# యువతలో నైపుణ్యత పెంచాలి
### ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి
### జిల్లా నైపుణ్య అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు, మేజర్‌న్యూస్ : యువతలో నైపుణ్యత పెంచాలి, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సూచించారు. శుక్రవారం జరిగిన జిల్లా నైపుణ్య అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ పలు కీలకమైన అంశాలపై చర్చించారు. జిల్లాలోని వివిధ డిగ్రీ కాలేజ్‌ల్లో గల విద్యార్థులకు ఆన్లైన్ ద్వారా జపనీస్ భాషపై శిక్షణ ఇవ్వడానికి తగిన ఏర్పాట్లు చెయ్యాలని సూచించారు. జిల్లాలో ఉన్నటువంటి వివిధ ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్స్‌లో అత్యాధునిక కోర్సులను విద్యార్థులకు బోధించాలని సూచించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్నటువంటి జాబ్ మేళాలకు అత్యధిక మొత్తంలో నిరుద్యోగ యువత హాజరై ఆ జాబ్‌మేళాలను సద్వినియోగపరచుకొని అధిక మొత్తంలో ఉద్యోగ అవకాశాలు పొందటానికి



విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. జిల్లాలో ఉన్నటువంటి స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజీల్లో డిమాండ్, సప్లైకి అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసి శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశం కల్పించాలని తెలియజేశారు. పీఎం ఇంటర్న్షిప్ ప్రోగ్రామ్‌పై విద్యార్థులలో మరింత అవగాహన కల్పించి వారు రిజిస్ట్రేషన్ అయ్యి ఈ ఇంటెన్షిప్ ప్రోగ్రామ్ను సద్వినియోగపరుచుకునే విధంగా చూడాలని జిల్లా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, జిఎం, డి.ఐ.సి, టి.రవికుమార్, పి.డి, డిఆర్‌డిఏ పి.డి, మెప్మా, శ్రీమన్నారాయణ, సీఈవో స్టెప్ ఆఫీస్, మదన్ మోహన్, జెడ్.ఎం ఏపీఐఐసీ, కె.ధనలక్ష్మి, ఈ.డి మైనారిటీస్, ఎన్.లక్ష్మణ్‌నాయక్, డి.డి సోషల్ వెల్ఫేర్, గాయత్రీదేవి, డిప్యూటీ కమిషనర్, లేబర్ డిపార్ట్మెంట్, వెంకటేశ్వర్లు, ఈ.డీ బీసీ కార్పొరేషన్, కె.అర్జున్ నాయక్, ఈ.డి ఎస్‌సి కార్పొరేషన్, కె.బెన్హార్ డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్, ఎం.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్, గవర్నమెంట్ ఐటిఐ, డి.వెంకటేశ్వర్లు, ఏ.టి.డబ్ల్యూ.ఓ, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, రవితేజ, డిఎస్డివో, ఏపీ ఎస్-ఎస్‌డిసి, రజనీకాంత్, జె.డి.ఎం, సి డాప్, నాగ శీను, ఏ.డి నాక్, కమల్ సా, డిస్టిక్ యూత్ ఆఫీసర్, నెహ్రూ యువ కేంద్ర, బాబూజీ, రోడ్ సిటీ, ఏపీ ఎస్ఎస్‌డిసి జిల్లా సిబ్బంది పాల్గొన్నారు.

# క్విస్ విద్యార్థులకు బ్యాంక్ ఆఫ్ బరోడా అచీవర్స్ అవార్డులు

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు బ్యాంక్ ఆఫ్ బరోడా అచీవర్స్ అవార్డులు అందించింది. అకడమిక్స్, రిసర్చ్, క్రీడ విభాగాల్లో అద్భుతమైన విజయాలు సాధించిన తొమ్మిదిమంది విద్యార్థులు ఈ అవార్డులను అందుకున్నారు. ఆయా విభాగాల్లో మొదటిస్థానంలో నిలిచిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.31,000 నగదు బహుమతిని అందించారు. క్విస్ కాలేజిలోని రామానుజన్ సెమినార్ హాల్ లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ కిరణ్ రెడ్డి, చీఫ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం విజేతలకు జ్ఞాపిక, సర్టిఫికెట్, మెడల్స్‌ను అందజేశారు.

బీటెక్ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థుల్లో 100 శాతం అటెండెన్స్ సాధించిన వారికి క్విస్ స్టార్టప్ కంపెనీ శ్రీచక్ర గిఫ్ట్స్ అండ్ బియాండ్స్ వారు ప్రత్యేక బహుమతులు అందించారు. ఈ సంద ర్భంగా క్విస్ విద్యాసంస్థల అధినేత కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ బ్యాంక్ ఆఫ్ బరోడా అచీవర్స్ అవార్డులను అం దించడం అభినందనీయం అన్నారు. కేవలం అకడమిక్స్ కాకుండా విద్యార్థుల్లోని మిగతా స్కల్స్ ని కూడా ప్రోత్సహించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. సరైన సమయంలో, సరైన టాలెంట్ ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తే విద్యార్థులు






సరికొత్త ఆలోచనలతో ముందుకు వస్తారని, అద్భుతాలు సృష్టిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా అవార్డులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన బ్యాంక్ ఆఫ్ బరోడా గుంటూరు రీజనల్ మేనేజర్ కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ మన ప్రాం తంలో నిర్వహించడం ఇదే మొదటి సారని అన్నారు. క్విస్ కాలేజి ప్రీమియం ఇన్ స్టిట్యూషన్ అని, అందుకే ఈ కాలేజిని ఎంచుకున్నట్లు చెప్పారు. విద్యార్థి దశ నుంచే రీసెర్చ్ మీద అవగాహన కల్పించే విధంగా ట్రైనింగ్ ఇస్తున్నారని, అది గొప్ప విజన్ అని కొనియాడారు. వివిధ రంగాల్లో రానిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యం తోనే ఇలాంటి అవార్డులు ఇస్తున్నట్లు చీఫ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం చెప్పారు. కార్యక్రమంలో క్విస్ కళాశాల ప్రిన్సిపల్ వైవి హనుమంతరావు, స్టూడెంట్స్ డీన్ జె.శ్రీనివాసరావు, క్విస్ కళాశాల ఉపాధ్యాయులు, బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు బహుమతులు

అకడమిక్స్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ విభాగానికి చెందిన వైష్ణవి మొదటి బహుమతి అందుకోగా ట్రిపుల్‌ఈకి చెందిన అమృత రెండో బహుమతి, ఈసీఈకి చెందిన శ్రీ పూజిత మూడో బహుమతి సాధించారు. రీసెర్చ్ విభాగంలో ఈసీఈకి చెందిన రమా శైలేంద్ర, సీఎస్ ఈకి చెందిన సంజన, ట్రిపులీ విభాగానికి చెందిన శ్రీ కృష్ణవేణి మూడో బహుమతి అందుకున్నారు. స్పోర్ట్స్ కేటగిరీలో సీఎస్ ఈ నాలుగో ఏడాదికి చెందిన విజయ్ కుమార్ రెడ్డి మొదటి బహుమతి, ఏడుకొండలు రెండో బహుమతి, ఐటీ విభాగానికి చెందిన అరుణ మూడో బహుమతి అందుకున్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను కాలేజి యాజమాన్యం, ఆయా విభాగాధిపతులు, ఉపాధ్యాయులు అభినందించారు.

# పరిశ్రమల స్థాపన దరఖాస్తులను పరిష్కరించాలి
### నిబంధనల ప్రకారం అనుమతులను మంజూరు చేయాలి: కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు, మేజర్‌న్యూస్ : పరిశ్రమల స్థాపనకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పునరుద్ఘాటించారు. శుక్రవారం కలెక్టరేట్లో ఆమె అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అనుమతుల కోసం వచ్చిన 565 దరఖాస్తులలో 499 ఆమోదం పొందాయని చెప్పారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ నిర్దిష్ట గడువు వరకు వేచి చూడకుండా సత్వరమే నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. పి.ఎం.ఈ.జి.పి పథకం కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే బ్యాంకులకు పంపించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతున్న ఎం.ఎస్.ఎం ఈ. సర్వేను త్వరగా



పూర్తయ్యేలా పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీలకు సంబంధించి 280 క్లెయిమ్స్ గాను రూ.6.19 కోట్లను మంజూరు చేశామన్నారు. అనంతరం పరిశ్రమల ప్రతినిధులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఒంగోలు ఆటోనగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు, తాగు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. గుండ్లపల్లి ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రానైట్ వ్యర్థాల కోసం డంపింగ్ యార్డును కేటాయించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను పరిష్కరించాలని ఒంగోలు మున్సిపల్ కమిషనరు, ఏ.పి.ఐ.ఐ.సి జోనల్ మేనేజరును ఆదేశించారు. గ్రానైట్ ఎగుమతుల కోసం చెన్నై పోర్టుకు వెళ్లడం వలన ఒక్కో కంటైనర్కు సుమారు రూ.20 వేల వరకు అదనంగా చెల్లించాల్సి వస్తున్నదని, కృష్ణపట్నం పోర్టులో గ్రానైట్ ఎగుమతుల కోసం ఒక బెర్త్‌ను కేటాయించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని గ్రానైట్ పరిశ్రమల ప్రతినిధులు కోరగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఏ, మెప్మా పి.డి రవికుమార్, డి.టి.సి. సుశీల, ఏ.పి.సి.పి.డి.సి.ఎల్ ఎస్.ఈ వెంకటేశ్వర్లు, ఒంగోలు డి.ఎల్.డి.ఓ వై.మహాలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కిట్స్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కి ఘన నివాళి



మార్కాపురం, మేజర్‌న్యూస్: స్థానిక కిట్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నివాళులు నివాళులు అర్పించినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అన్నా క్రిష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య పాల్గొని ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదనంతరం మాట్లాడుతూ భారత దేశానికీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రంగనాయకులు, కళాశాల ఏవో బి.ప్రభాకర్, వివిధ విభాగపు అధిపతులు పి.రామ్మోహన్, డాక్టర్ జెవి అనిల్ కుమార్, కే.రాముడు, కే.కిషోర్ బాబు, ప్రసన్న మురళి, జే.రమణారెడ్డి, ఏ.అమృతవల్లి, పి.మనోహర్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎన్.రంగస్వామి, ఎన్ఎస్ఎస్ అంజని కుమార్, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జోరావర్ సింగ్, ఫతే సింగ్‌లకు నివాళి



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని స్ప్రింగ్ బోర్డ్ స్కూల్‌లో వీర బాల్ దివస్ కార్య కార్యక్రమము పట్టణ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ వీర్ బాల్ దివస్ డిసెంబర్ 26 జరుపుకుంటారు అని ఇది వీరత్వం, త్యాగం స్ఫూర్తితో నిండిన రోజు అని తెలిపారు. మీరు అందరూ వారిని స్ఫూర్తి తో నడుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కె.చంద్ర మోహన్, జిల్లా ఎస్సి మోర్చ ప్రధాన కార్యదర్శి మద్దెమల్ల పుల్లయ్య, పట్టణ జిఎస్ మునగనూరి రామకృష్ణ, జిల్లా ఒబిసి ప్రధాన కార్యదర్శి బాదుల్ల, పట్టణ ఒబిసి అధ్యక్షులు కొప్పుల నరసింహులు, జిల్లా ఒబిసి జిల్లా కార్యవర్గ సభ్యులు వీర చక్రం, బిజెపి సీనియర్ నాయకులు మారుతి పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుకు 17 అర్జీలు



కొండేపి, మేజర్‌న్యూస్: మండల తహసీల్దార్ పి.మురళి ఆధ్వర్యంలో శుక్రవారం చినకండ్లగుంట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూమి సమస్యలపై మొత్తం 17 అర్జీలు వచ్చినట్లు తెలియజేశారు. వాటిలో 6 సమస్యల్ని అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందన్నారు. అన్ని అర్జీలను మీకోసం పోర్టల్ నందు నమోదు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు నర్సారెడ్డి, రీసర్వే డీటీ కాశయ్య, సర్వేయర్ రాజు, ఆర్ఐ శ్రీనివాసులు వీఆర్వో, గ్రామ సర్వేయర్లు, ఆఫీసు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గుట్టుచప్పుడు కాకుండా జోరుగా కోడి పందేలు

నిజాంపట్నం, మేజర్‌న్యూస్: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఇప్పటినుండి మండలంలోని కోడి పందెములు పందెపురాయుళ్ళు గుట్టుచప్పుడు కాకుండా మండలంలోని అనేక ప్రాంతాలలో పందెములు నిర్వహిస్తు పైపెందాలు కాశి వేలకువేలు పోగొట్టుకుంటున్నారు. ఆదివారాలు మరియు పండుగలనుటార్గెట్ చేస్తూ కోడి పందాలు జోరుగా కొనసాగుతున్నాయి. పోలీసులక తెలిసి నప్పటికీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనాఅధికారులు స్పందించి జూదాలను అరికట్టాలని ఆయాగ్రామప్రజలు కోరుతున్నారు.

# దొంగదోవలో ఉన్న పెన్షన్లు నిలుపుదల చేస్తున్నారు: కోన



బాపట్ల, మేజర్‌న్యూస్: మరొక్కసారి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోజు మేము ఇలా చేయలేదని నాయకులు చేయలేదని దొంగ కేసులు పెట్టలేదని పార్టీలు చూడలేదని ప్రతి ఒక్క లబ్ధిదారులకు పథకాలు అందించామని మరి ఈరోజు దొంగ దోవలో ఉన్న పెన్షన్లు నిలుపుదల చేస్తున్నారని అన్నారు బాపట్ల నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ కొన రఘుపతి. బాపట్ల నియోజకవర్గ వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం నుండి పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా, పార్టీ శ్రేణులు, బాపట్ల పట్టణం రథం బజార్ నియోజకవర్గం నుండి ర్యాలీగా బయలుదేరి పెద్ద ఎత్తున నినాదాలు చేసు కుంటూ రోడ్డులో గల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయంలో ఎస్ఈ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు బాపట్ల జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు మేరుగు నాగార్జున, బాపట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కోన రఘుపతి. అనంతరం జరిగిన పత్రిక సమావేశంలో కోన రఘుపతి మాట్లాడుతూ కరెంట్ చార్జీలు పెంచను జగన్మోహన్ రెడ్డికి చేతకాలేదు ఆరేడు సార్లు పెంచాడని నేను అధికారంలోకి వస్తే ఇంకా తగ్గిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ప్రజలపై, రూ.15,485.36 కోట్లు భారం మోపిన నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. బాదుడే బాదుడు అంటూ ప్రచారం చేసుకొని మీడియాని అడ్డం పెట్టుకొని అబద్ధాన్ని వండి వర్చారని ప్రజల్ని మోసం చేశారని ఆరు నెలల్లోనే వారు ఇచ్చిన మోసపూరిత వాగ్దానాల్ని అమలుపరచలేక చతికిల పడ్డారని అన్నారు.

# రూ. 65,23,520ల మిగులు బడ్జెటు ఆమోదం

అద్దంకి, మేజర్‌న్యూస్: అద్దంకి పురపాలక సంఘంలో రానున్న 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.65,23,520ల మిగులు బడ్జెట్కు పాలకమండలి ఆమోదం తెలిపింది. పురపాలక సాధారణ సమావేశం చైర్పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ముందుగా భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ సీనియర్ సహాయకురాలు లీలావతి సభ్యుల ముందు బడ్జెట్ ప్రతులు చదివి వినిపించారు. రానున్న 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం రాబడిగా రూ.22,94,171,282లు సమకూరనున్నట్లు అంచనా వేశారు. ఇదే సమయంలో ఖర్చులు కింద రూ.22,29,47,762లు అయ్యే అవకాశం ఉందని అంచ నాలు తయారు చేశారు. దీంతో రూ. 85,29,520 ల మిగు లు బడ్జెట్ ను పాలకమండలి ఆమోదం తెలిపారు. కమిషనర్ డి.రవీంద్ర, ఏఈ లోకేష్, ఆర్ ఐ అర్జున్ రావు, అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు పాల్గొన్నారు.



**స్థానిక అంశాలపై వైకాపా కౌన్సిలర్ల ప్రశ్నలు.**

అద్దంకి పురపాలక సంఘంలో నెలకొన్న సమస్యలపై వైకాపా కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ డి. రవీంద్ర సమాధానం చెప్పారు. పట్టణం లోని ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద నిర్వహిస్తున్న శుద్ధ జలకేంద్రాల్లో 20 లీటర్ల క్యాను రూ.5లు వసూలు చేస్తున్నారని, వాస్తవానికి రూ. 2లు మాత్రమే వసూలు చేయనున్నట్లు నిబంధనలు ఉన్నాయని వైకాపా కౌన్సిలర్ కొత్తగొర్ల వెంకటసుబ్బారావు(బాలు) సభ దృష్టికి తీసుకొచ్చారు.

# మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



దర్శి, మేజర్‌న్యూస్: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చెసుకోవద్దని ఎక్సైజ్ సిఐ కె.శ్రీనివాసరావు అన్నారు. డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆదేశాలు మేరకు దర్శి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాస రావు, సిబ్బందితో కలసి.దర్శి జూనియర్ కళాశాలనందు గంజాయి లాంటి మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమము నిర్వహించారు. విద్యార్థులు యువతగా ఉన్నప్పుడే మత్తుపదార్థాల వల్ల జరిగే అనర్థాలను గురించి అవగాహన కలిగి ఉండి వాటి బారిన పడకుండా వాటికి దూరంగా ఉండి సమాజములో మంచి పౌరులుగా ఎదగాలని మత్తు పదార్థాలు లేని సమాజం కోసం కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు మత్తు పదార్థాలలోని రకాలు అవి మానవ కేంద్రీకృత నాడి వ్యవస్థపై ఏ విధంగా ప్రభావితం చేస్తాయి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకట సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలకు 25 కుర్చీలు బహుకరణ



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చిలుకూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడవ తరగతి చదువుతున్న దాసరి స్వాతి శుక్రవారం పుట్టిన రోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులైన దాసరి అంకయ్య. దేవి పాఠశాలకు రూ.20వేలు విలువ చేసే 25 కుర్చీలు బహుఘన ఇచ్చినట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.అనురాధ తెలిపారు. అయితే స్వాతి తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉండటంవల్ల స్వాతి వాళ్ళ అమ్మమ్మ, తాతయ్యలు దారం చిన్న కోటేశ్వరరావు, మాలకొండమ్మ ద్వారా ఈ కుర్చీలు ఇవ్వడం జరిగిందని హెచ్ఎం తెలిపారు. పాఠశాలకు ఇంతటి కార్యక్రమం చేపట్టేందుకు ముందుకు వచ్చి నందుకు స్వాతి తాతయ్య, అమ్మమ్మలకు ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని మరోసారి గుర్తు చేశారు ప్రభుత్వం నుంచి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలతో విద్యార్థులకు విద్య అందిస్తున్నారని మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారమే ఒక క్రమపద్ధతిలో ఈ పాఠశాలలో కల్పిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఇంకా దాతలు ఎవరైనా ఉంటే ఈ పాఠశాల అభివృద్ధికి ముందుకు రావాలని హెచ్ఎం అనురాధ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: గ్రామాలలో రైతులు భూ సమస్యలు పరిష్కార మార్గం కోసమే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సు ద్వారా వీలైనంత త్వరలో భూ సమస్య పరిష్కారం మార్గం అవుతాయని మండల తాసిల్దార్ బి.జనార్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చింతలపాలెం జరుగుమల్లి గ్రామాలలో సచివాలయంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు ఈ సదస్సులో 16 అర్జీలు వచ్చినాయిని వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వీలైనంత త్వరలో అనగా 60 రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి అవుతాయని మరోసారి గుర్తు చేశారు. ఈ రెవెన్యూ సదస్సులో ప్రత్యేక అధికారి భాస్కర్ మండల సర్వేలు వై.బాబురావు, మాల్యాద్రి, డిప్యూటీ తాసిల్దార్ ప్రసన్న, ఆర్ఐ ప్రసన్నలక్ష్మి, వీఆర్ఓ చైతన్య, చింతలపాలెం సర్పంచ్ వేల్పుల హరిబాబు, జరుగుమల్లి టిడిపి యువ నాయకుడు కొండూరి శివ పాల్గొన్నారు.

## ఎక్సైజ్ తనిఖీలో బెల్లంఊట ధ్వంసం



చీరాల, మేజర్‌న్యూస్: ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఒంగోలు వారి ఆదేశాలమేరకు జిల్లా రైడ్‌లో బాగంగా అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాపట్ల వారి ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ వారి సిబ్బందితో శుక్రవారం చీరాల రామనగర్ నందు గల ఐఎల్టిడి కంపెనీ వెనుక పరిసర ప్రాంతాలలో రైడ్ చెయ్యటం జరిగింది. అనంతరం నాటు సారాయి తయారు చేయుటకు ఉపయోగపడు బెల్లపు ఊటను గుర్తించి సిబ్బందితో ధ్వంసం చేశారు. బెల్లపు ఊట ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములను ఆ ప్రదేశం నందు ధ్వంసం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం

వేమూరు(భట్టిప్రోలు) మేజర్‌న్యూస్: భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి భారతదేశానికి తీరని లోటని పలువురు ప్రముఖులు అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆర్థిక శాస్త్రవేత్తగా, దేశ ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ భారత్ ప్రజలకు విస్తృత సేవలు అందించారని కొనియాడారు.ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎంపీపీలు దాసరి ముత్తయ్య, బొలిశెట్టి ప్రభాకర రావు,విష్ణు మొలకల వెంకటరెడ్డియ్య,మాజీ డిసిఎంఎస్ చైర్మన్ గాజుల మోహన్, సీనియర్ నాయకులు దాది సుబ్బారావు,దున్న మేరీస్ బాబు, గాజుల చిన్నబాను,గోపాళం రాములు తమ సంతాపాన్ని వెలిబుచ్చారు.

## తోకలవారిపాలెంలో రెవెన్యూ సదస్సు



కొల్లూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని తోకలవాని పాలెం పంచాయితీ పరిధిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొల్లూరు మండల తహసిల్దార్ బి వెంకటేశ్వర్లు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని ఉద్దేశం తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

## హెల్మెట్‌ను ధరించండి



నగరం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన నగరంలో శుక్రవారం జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ తుషార్ డూడీ ఉత్తర్వులు మేరకు ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ పై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. హెల్మెట్ లేని వారిపై ఫైన్లు వేసి హెల్మెట్ లేకపోవడం వల్ల జరిగే అనర్థాల పై ఎస్ ఐ భార్గవ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగరం పిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు అమ్మవారి ఆలయానికి రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్వి రమణ



పిట్టలవానిపాలెం మేజర్ న్యూస్: ది 29-12-2024 ఆదివారం భారతదేశ సర్వోన్నత రిటైర్డ్ ప్రధానన్యాయమూర్తి ఎన్ వి రమణ శ్రీ భగలాముఖి అమ్మవారి ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమంలో విశేష హెూమ కార్యక్రమములలో పాల్గొనబోతున్నారని, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలియపరిచారు.

## మరో మైలురాయి దాటిన తుగ్లక్ జగన్ : పల్లం సరోజిని



బాపట్ల, మేజర్న్యూస్: తుగ్లక్ చర్యల్లో మరో మైలురాయి దాటిన జగన్ రెడ్డి తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తానే ధర్నాకు పిలుపునిచ్చారు అని అన్నారు తెదేపా ఎస్సీ సెల్ లీడర్ మహిళా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ జీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రూ అప్ చార్జీల భారం కచ్చితంగా జగన్ మోహన్ రెడ్డి దే గతంలో సీఎంగా జగన్ చేసిన పాపాలే ప్రజలకు శాపాలుగా మారాయి.పీపీఏల రద్దు, సోలార్, విండ్ పెట్టుబ డిదారులను బెదిరించి విద్యుత్ లోటుకు కారణం అయ్యాడు.జగన్ హయాంలోనే ఏపీ జెన్కో సర్వనాశనం అయ్యింది. రెండేళ్ల క్రితమే విద్యుత్ చార్జీలు పెంచాలని జగన్ రెడ్డి ఈఆర్సీని కోరారు.నేడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా కూటమి ప్రభుత్వం పై ఆరోప ణలు చేయడం హాస్యాస్పదమని ఆమె తెలిపారు.జగన్ హయాంలోనే వసూళ్లకు అనుమతి కోరిన డిస్కంలు వాయిదా వేస్తూ కమిషన్ ముగిసే మూడు రోజుల ముందుగా వసూళ్లకు ఆదేశాలు ఇవన్నీ తెలియని అనుకుంటే ఎలా జగన్మోహన్ రెడ్డి మీరు పెంచిన విద్యుత్ చార్జీలపై మీరే ధర్నా చేయటం చూస్తూఉంటే ప్రజలందరూ నవ్వుకుంటు న్నారు అని అన్నారు.

## వీర మహిళ గుంటుపల్లి తులసి కుమారి జన్మదిన వేడుకలు



బాపట్ల టౌన్, మేజర్ న్యూస్: ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ మహిళ కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బాపట్ల పట్టణం శృంగారపురం తాలింఖానా ప్రాంతంలో శృంగారపురం జన సైనికుల ఆధ్వర్యంలో జనసేన పార్టీ వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ మహిళా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తులసి కుమారిని ప్రత్యేకంగా ఆహ్వానించి 5 కేజీల కేకును కట్ చేపించి నోరు తీపి చేసి అందరూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించి ప్రధానోపాధ్యాయురాలుగా పదవి విరమణ పొంది ఎంతోమంది విద్యార్థులకు ఆమె జ్ఞానాన్ని మంచి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసి వారి బంగారు భవిష్యత్తుకు కారణమయ్యారని అనంతరం ప్రజాసేవకై పవన్ కళ్యాణ్ ఆశయాలకు తోడుగా నడవాలని రాజకీయాల్లోకి వచ్చారన్నారు.

## నీరు పొదుపుగా వాడండి: కృష్ణమోహన్

బాపట్ల మేజర్ న్యూస్: ఈ నీటి సంవత్సరం 2024-25 లో సంతృప్తికరం గా వర్షాలు పడటంతో నాగార్జున సాగర్ రిజర్వాయరు నిండి నాగార్జున సాగర్ జవహర్ కాలువ క్రింద ఉన్న ఆయకట్టు కూ సరిపడా నీటి విడుదల సాధ్యపడినది. నా.సా.జ. కాలువ క్రింద ఉన్న ఖరీఫ్ ఆయకట్టుకు తేదీ 15-08-2024 నుండి నీటి సరఫరా చేయటం జరుగుతున్నది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు వారు నా .సా.జ. కాలువ కు కేటాయించిన 132 టి.ఎం.సి.ల నీటిలో ఈ నీటి సంవత్సరంలో అధికభాగం ఇప్పటికే వినియోగించగా ప్రస్తుతం సుమారుగా మిగిలి ఉన్నది కేవలం ఐదోవంతు నీరు మాత్రమే, దీనిని రాబోయే ఎండాకాలం అనగా మే- 2025 వరకు సాగు, త్రాగు నీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించవలసి ఉంటుంది. నాగార్జున సాగర్ రిజర్వాయర లో నీటి నిల్వ లు తగ్గు ముఖం పట్టడంతో రైతులకు తెలియజే యునది ఏమనగా నీటిని వృధా చేయరదన్నారు.

# ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కారం కావాలి

బాపట్ల, మేజర్న్యూస్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు అధికారులు తక్షణమే పరిష్కారం చూపాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కేసుల పరిష్కారంలో ఎలాంటి సమస్యలు రాకుండా కుల ధ్రువీకరణ పత్రాలను తక్షణమే జారీ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సమాజంలో సమాన హక్కులు ఉన్నాయన్నారు. పౌరహక్కులు ఉల్లంఘనకు గురికాకుండా చూడడానికి రాజ్యాంగం అనేక చట్టాలను రూపొందించిందన్నారు. పౌర హక్కుల దినోత్సవం ప్రతినెల, ప్రతి మండలంలో నిర్వహించేలా



అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది 99 కేసులు నమోదు కాగా, 86 కేసులకు ఎఫ్ఐఆర్ నమోదయిందన్నారు. 85 కేసులకు చార్జిషీట్ వేయగా, 86 కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయన్నారు. బాపట్ల డివిజన్ కింద 20 కేసులు పోలీసుల విచారణలో ఉండగా, 38 కేసులు చీరాల పరిధిలో, 19 కేసులు రేపల్లె డివిజన్ పరిధిలో ఉన్నాయన్నారు. ఈ కేసులకు రూ.45.25 లక్షలు పరిహారం కింద బాధిత కుటుంబాలకు చెల్లించాల్సి ఉందని, ప్రస్తుతం నిధుల కొరత ఉందన్నారు. నిధుల కొరతపై ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ఏడాది గడిచిన పాత కేసులన్నీటిని తదుపరి సమీక్ష సమావేశంలోగా పరిష్కరించాలని అధికారులను ప్రఖర్ జైన్ ఆదేశించారు. కేసుల పరిష్కారంలో పురోగతి సాధించాలన్నారు. నిర్ణయిత గడువులోగా కేసులకు పరిష్కారం చూపాలన్నారు. అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు స్మశాన భూములు కచ్చితంగా చూపించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె రాజాదెబోరా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు కట్ట శ్రీనివాసరావు, తుపాకుల సురేష్, గళ్ళ నాగమణి, పందుగుల ప్రసాద్, ఎన్జీవో ప్రతినిధి షేక్ పఠాన్ మహమ్మద్ ఖాన్, ఆర్డీవోలు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదు

అద్దంకి, మేజర్న్యూస్: ద్విచక్ర వాహనాల పై ప్రయాణించే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ప్రజలకు సూచించారు. బాపట్ల జిల్లాలోని మేదరమెట్ల, అద్దంకి పోలీస్ స్టేషన్లను శుక్రవారం జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ ల పరిసరాలను పరిశీలించి, వివిధ నేరాలలో సీజ్ చెయ్యబడిన వాహనాలను తనిఖీ చేసి వాహనాలను భద్రపరిచే విషయంలో పలు సూచనలు చేసినారు. స్టేషన్ లలో నిర్వహిస్తున్న క్రైమ్ రికార్డులను పరిశీలించి నేర సమాచారాన్ని ఎప్పటికప్పుడు పొందుపరుస్తూ సక్రమంగా రికార్డులను నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరిగే నేరాల గురించి వాటి దర్యాప్తును ఏ విధంగా నిర్వహిస్తున్నారు అనే విషయాలు పోలీసు అధికారులను అడిగి తెలుసుకు న్నారు. సిబ్బందితో వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరితో మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధులు, శాఖపరంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్



సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. శాఖ పరమైన సమస్యలను స్వయంగా తెలపవచ్చునన్నారు. వారి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణిం చేటప్పుడు పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కొందరు వ్యక్తులు నిర్లక్ష్యంగా, అతి వేగంగా వాహనాలు నడపడం వలన ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయన్నారు. రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు మరణాలకు గురవుతున్న వారిలో ఎక్కువ శాతం మంది ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారే ఉంటున్నారన్నారు. హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచడం జరిగిందన్నారు. వారు చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనే అవకాశం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేరాలను కట్టడి చేసేందుకు ముఖ్యమైన కూడళ్ళు, రహదారులపై సీసీ కెమెరాలు ఏర్పాటు చెయ్యడం జరుగుతుందన్నారు. వాటిని ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు పర్యవేక్షిస్తూ ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పీ ఎమ్.డి. మొయిన్, అద్దంకి పట్టణ ఇన్స్పెక్టర్ పి.కృష్ణయ్య, మేదరమెట్ల ఎస్.ఐ మహమ్మద్ రఫీ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అమిత్ షా రాజీనామా కోరుతూ 30న నిరసనలు : తన్నీరు సింగరకొండ

బాపట్ల టౌన్, మేజర్న్యూస్: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్పై అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కోరుతూ ఈ నెల 30న నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బాపట్ల జిల్లా వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్లో శుక్రవారం వామపక్ష నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా ప్రధాని నరేంద్ర మోడీ అమిత్ షాను వెనకేసుకురావడం సిగ్గుచేటు అన్నారు. డిసెంబరు 30న జాతీయ నిరసన దినాన్ని పాటించాలని వామపక్షాలు సంయుక్తంగా నిర్ణయించాయని తెలిపారు. హెూం మంత్రిగా అమిత్ షా రాజీనామా చేయాలన్న డిమాం డ్ను పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. బాపట్ల పట్టణంలోని చీల్



రోడ్డు సెంటర్లో ఉన్న చివకుల శేష శాస్త్రి స్తూపం నుంచి బాపట్ల జమ్ములపాలెం రోడ్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఖండించేందుకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు మేకల ప్రసాద్, సిపిఐ రెడ్ స్టార్ జిల్లా నాయకులు భాష, వామపక్ష నాయకులు జేబి శ్రీధర్, సిహెచ్ మజుందర్, కోట నాగరాజు రెడ్డి,నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

భట్టిప్రోలు,మేజర్న్యూస్: ఎంతోకాలంగా పరిష్కారం కానీ భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నదని రేపల్లె ఆర్డిఓ ఎన్ రామలక్ష్మి అన్నారు.శుక్రవారం మండల కేంద్రమైన భట్టిప్రోలు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన అద్దేపల్లి లో రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన రెవిన్యూ సదస్సుకు భట్టిప్రోలు తహసీల్దారు ఎం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామలక్ష్మి మాట్లాడుతూ అర్జీలు ఇచ్చిన ప్రతి రైతు రసీదును తప్పనిసరిగా పొందాలన్నారు.భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి రైతులకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు,1బి, అడంగల్,తదితర సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం మండలంలోని ఐలవరం గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు.భట్టిప్రోలు సదస్సులో 26 అర్జీలు,ఐలవరం సదస్సులో 22 అర్జీలు అందినట్లు




మండల ఆర్ ఐ తన్నీరు లీలా ఆనంద ఫణికుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు ధారా రవికిరణమయి (భట్టిప్రోలు),మాచర్ల కోటేశ్వరరావు (ఐలవరం)ఎంపీడీవో ఎస్ వెంకటరమణ,సీనియర్ అసిస్టెంట్ డి ఎల్ ఎన్ ఆర్ ప్రసన్న,అద్దేపల్లి ఐలవరం విఆర్వోలు ఎన్ లక్ష్మి,టి రత్నాకర్,గొరిగిపూడి విఆర్ఓ పుల్లయ్య,భట్టిప్రోలు విఆర్ఓ పి కాళీ కృష్ణ, వెల్లటూరు పివి శివరామకృష్ణ,పల్లికోన వీఆర్వో అంబటి ప్రసాద్,ఓలేరు ఎల్ సురేష్,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల పెంపుపై వైసిపి శ్రేణులు నిరసన



పుల్లలచెరువు, మేజర్న్యూస్: విద్యుత్ ఛార్జీల పెంపుపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకే 'ఇదేం బాదుడు బాబు' కార్యక్రమం చేపట్టారు. వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేర కు గురువారం యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో ఎంఎల్ఏ తాటి పర్తి చంద్రశేఖర్ ఆద్వర్యంలో నియోజ కవర్గ నాయకులు కార్యకర్తలతో కలసి బారి ఎత్తున పెరిగిన విద్యుత్ చార్జీలపై నిరసన కార్యక్రమం చేప ట్టారు. పార్టీ కార్యాలయం నుంచి విద్యు త్ సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహి ంచారు. పెరిగిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గిం చాలని అలాగే వ్యవసాయ పంపుసెట్లకు కనెక్షన్లు వెంటనే ఇప్పించాలని ప్లేకార్డ్స్తో భారీగా సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ అధికారులకు లేఖను అందజేశారు. ఈ ర్యాలీలో నియోజకవర్గ ఐదు మండలాల కన్వీనర్లు ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపీ టీసీలు, సర్పం చులు, ఆయా విభాగాల అధ్యక్షులు వేల సంఖ్యలో నియోజకవర్గ నలుమూ లల నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.